



RNI - TELTEL/2023/87644


# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 293 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 10-02-2026 | పేజీలు-8 | వెలః రూ. 5.00



## జీవితంలో ఏదీ సులువుగా ఉండదు..

- విద్యార్థులు చదువుతో పాటు జీవితాన్ని కూడా ఆస్వాదించాలి
- టెక్నాలజీతో ఎలా పనిచేయాలన్నది నేర్చుకోవడం చాలా ముఖ్యం
- సాంకేతికతే మిమ్మల్ని బానిసలుగా మార్చుకునే పరిస్థితికి వెళ్లొద్దు
- పరీక్షా పే చర్చలో విద్యార్థులతో మోదీ

న్యూఢిల్లీ -
సాంకేతికత మనం పనిచేసే విధానాన్ని మారుస్తుందని, దాన్ని అర్థం చేసుకుని అవసరానికి తగినట్లుగా వినియోగించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. అంతేగానీ సాంకేతికతే మిమ్మల్ని బానిసలుగా మార్చుకునే పరిస్థితికి వెళ్లొద్దని సూచించారు. 'పరీక్షా పే చర్చ ' రెండో ఎడిషన్‌లో భాగంగా పలువురు విద్యార్థులతో ప్రధాని మాట్లాడారు.ఈ సందర్భంగా కెరీర్ పురోగతికి సంబంధించి వారికి విలువైన సూచనలు చేశారు. విద్యార్థులు వెలిబుచ్చిన సందేహాలకు సమధానాలు ఇచ్చారు. క్రమశిక్షణ, ప్రేరణ ఈ రెండింటిలో ఏది ముఖ్యం..? అన్న ప్రశ్నకు.. ఆ రెండింటినీ పోల్చకూడదని అన్నారు. ఎంత స్ఫూర్తి పొందినా ఆచరణలో క్రమశిక్షణ లేకపోతే సత్ఫలితాలు పొందలేరని అన్నారు. సమయపాలన, స్థిరత్వం, స్వీయ క్రమశిక్షణే మన ప్రేరణను అర్థవంతమైన ఫలితాలుగా


-మిగతా 2 లో

## రెండేళ్ల అభివృద్ధిని చూసి

# ఓటేయండి

### రాష్ట్రంలో అనేక పథకాలతో అభివృద్ధి, సంక్షేమాన్ని చేపట్టాం

- 12 ఏళ్ల బీజేపీ పాలన, పదేళ్ల బీఆర్ఎస్ పాలన చూడండి
- మోడీకి మున్సిపల్ ఎన్నికలకు సంబంధం ఏమిటో
- తెలంగాణ రూపాయి ఇస్తే..42 పైసలే వాపస్ వస్తున్నాయి
- ఉత్తరాది బీహార్, యూపిలతో పోలిస్తే దారుణమైన పరిస్థితి
- దక్షిణాది సొమ్ముతో ఉత్తరాది రాష్ట్రాలకు సోకు
- ఇద్దరు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఏం చేస్తున్నట్లు
- మీడియా సమావేశంలో గణాంకాలతో వెల్లడించిన సీఎం రేవంత్ రెడ్డి





పట్టణాల అభివృద్ధి కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యం

దక్షిణాది రాష్ట్రాలపై కక్షగట్టిన ప్రధాని మోడీ

హైదరాబాద్ ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌కు ఓటేయాలని, దీంతో మున్సిపాలిటీల్లో అభివృద్ధికి ప్రభుత్వానికి అవకాశం ఉంటుందని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలన, 12 ఏళ్ల మోడీ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేసుకుని అభివృద్ధికి పట్టం కట్టాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసిన వేళ సిఎం రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలకు మోడీకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. మోడీ ముఖం చూసి ఓటేయమని బిజెపి అడగడాన్ని ఎద్దేవా చేశారు.

-మిగతా 2 లో



## పదేళ్లలో చేయని అభివృద్ధి ఇప్పుడెలా చేస్తారు

- మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా మద్దతు మాకే
- బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు
- రెండేళ్లలో ప్రజాప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధీమా

ఖమ్మం,-ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
రాష్ట్రంలో పదేండ్లు అధికారంలో ఉండి ఏమీ చేయలేనోళ్లు.. ఇప్పుడెట్ల అభివృద్ధి చేస్తారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు, అధికారంలో ఉన్నప్పుడు దొర పోకడ తప్ప పేదోల కష్టాలు తెలుసుకోలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. రెండేళ్లలో ప్రజాప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. పంచాయితీల్లో మద్దుత తెలిపనట్లే మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రాజమద్దతు తమకు ఉందన్నారు. చివరి రోజు ఆయన సుగిగాలి పర్యటనలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

-మిగతా 2 లో



## మేం ఎవరికీ భయపడం

- యురేనియం శుద్ధిపై తగ్గేదే లేదన్న ఇరాన్
- తమను శాసించే హక్కు ఎవరికీ లేదు
- అమెరికా సైనిక మోహరింపు తమను భయపెట్టలేవు
- అమెరికా తో అణు చర్చలు జరుగుతున్న వేళ ఇరాన్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ
అగ్రరాజ్యం అమెరికా తో అణు చర్చలు జరుగుతున్న వేళ ఇరాన్ కీలక వ్యాఖ్యలు చేసింది. యురేనియం శుద్ధిపై తాము వెనక్కి తగ్గేదేలేదని స్పష్టం చేసింది. తమను ఎవరూ భయపెట్టలేరని, తాము ఎవరికీ భయపడేది లేదని అగ్రరాజ్యంపై కవ్వింపులకు పాల్పడింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బా అరాఘ్చి ఈ వ్యాఖ్యలు చేశారు.అమెరికా పై తమకు పెద్దగా నమ్మకం లేదని, యురేనియం శుద్ధిపై తామెందుకు వెనక్కి తగ్గాలని అరాఘ్చి అన్నారు. ఒకవేళ తమపై యుద్ధం ప్రకటించినా తాము దాన్ని వదిలేయబోమని చెప్పారు. తమను శాసించే హక్కు ఎవరికీ లేదన్నారు. ఈ ప్రాంతంలో వారి (అమెరికా) సైనిక మోహరింపు తమను భయపెట్టలేదని చెప్పారు. అమెరికాతో చర్చల గురించి తమ వ్యూహాత్మక భాగస్వామ్య దేశాలైన చైనా, రష్యాను కూడా సంప్రదిస్తున్నట్లు వెల్లడించారు. ఒమన్ వేదికగా ఇరాన్, అమెరికా మధ్య ప్రస్తుతం పరోక్ష చర్చలు జరుగుతున్నాయి.

-మిగతా 2 లో

## రేవంత్ రెడ్డి జైలుకెళ్లడం ఖాయం

- అందుకే ఓటుకునోటు ఫైలళ్లు దగ్ధం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపణ



మెదక్, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి నిప్పులు చెరిగారు. సోమవారం మెదక్‌లో హరీశ్ రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. అందుకే ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దగ్ధం

-మిగతా 2 లో

## సర్'కు అడ్డంకులు కల్పించవద్దు..

- పశ్చిమబెంగాల్‌కు సుప్రీంకోర్టు వార్నింగ్
- సర్ ప్రక్రియలో ఏవైనా ఆదేశాలు, స్పష్టత అవసరమైతే తాము కల్పించుకుంటాం
- అంతేతప్ప సర్ ప్రక్రియకు అడ్డంకులు కల్పించే ప్రయత్నాలు చేయవద్దు
- ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలు అర్థం చేసుకోవాలి





న్యూఢిల్లీ-
పశ్చిమబెంగాల్ లో నిర్వహిస్తోన్న 'సర్' ప్రిక్రియ ను వ్యతిరేకిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. సర్ ప్రక్రియలో ఏవైనా ఆదేశాలు, స్పష్టత అవసరమైతే తాము కల్పించుకుంటామని స్పష్టంచేసింది. అంతేతప్ప సర్ ప్రక్రియకు అడ్డంకులు కల్పించే ప్రయత్నాలు చేయవద్దని బెంగాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలు అర్థం చేసుకోవాలని సూచించింది.ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కోసం 300 మంది అధికారులను కేటాయించాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని కోరితే 80 మంది గ్రేడ్-2 స్థాయి అధికారులనే కేటాయించిందని న్యాయస్థానానికి ఈసీ తెలియజేసింది. మరోవైపు ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకున్నారని, అర్హులైన ప్రజలను ఓటర్ల జాబితాల్లో చేర్చడంలేదని బెంగాల్ ప్రభుత్వం పేర్కొన్నది. ఇంటి పేర్లలో అక్షరదోషాలు,

-మిగతా 2 లో

## ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారపర్వం

- 116 మున్సిపాలిటీలు ,7 మున్సిపల్ కార్పొరేషన్లలో హోరెత్తిన ప్రచారం
- 11న పోలింగ్‌కు ఎన్నికల సంఘం సర్వం ఏర్పాట్లు



హైదరాబాద్ -ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
తెలంగాణ రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రచార పర్వం ముగిసింది. చివరిరోజు ఉధృతంగా ప్రచారం సాగింది. కాంగ్రెస్ నుంచి మంత్రులు తమ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. బిజెపి, బిఆర్ఎస్ నేతలు కూడా ప్రచారంలో దూసుకుపోయారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు , 7 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఎన్నికల ప్రచారానికి తెరపడింది. అధికార , ప్రతిపక్ష పార్టీలు తమ సత్తా నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలను సెమీ ఫైనల్స్‌గా భావిస్తున్నాయి. అగ్రనేతల పర్యటనలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారంతో ఇన్నాళ్లూ

-మిగతా 2 లో

## రెండేళ్ల తరవాత మళ్లీ అధికారం మాదే

### కేసీఆర్‌ను తిట్టినోళ్లు ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టం



- మా కార్యకర్తల జోలికొస్తే ఊరుకోమని స్పష్టం
- పాలన చేతకాక...హామీలను అటకెక్కించారు
- హామీల అమలుకు నిలదీస్తూనే ఉంటాం
- భూపాలపల్లి ప్రచారంలో బీఆర్ఎస్ నేత కేటీఆర్

జయశంకర్ భూపాలపల్లి ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు.రెండేళ్ల తర్వాత ఎగిరేది గులాబీ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను తిట్టినోళ్లు ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టమని హెచ్చరించారు. మా కార్యకర్తల జోలికొస్తే ఊరుకోమని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారానికి చివరి రోజు భూపాలపల్లిలో కేటీఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ మాట్లాడుతూ..

-మిగతా 2 లో



## స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం..

- నోటీసు ఇచ్చేందుకు విపక్షాలు ప్లాన్
- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే నివాసంలో జరిగిన విపక్ష సభ్యుల భేటీలో ఈ నిర్ణయం
- లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రసంగించేందుకు స్పీకర్ అవకాశం ఇవ్వడం లేదని ఆరోపణ

న్యూఢిల్లీ:-
లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు విపక్షాలు ప్లాన్ చేస్తున్నాయి. దీని కోసం నోటీసు ఇవ్వనున్నట్లు విపక్ష పార్టీలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే నివాసంలో జరిగిన విపక్ష సభ్యుల భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. లెఫ్ట్ ఫ్రంట్ ఎంపీ ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ ఈ విషయాన్ని కన్ఫర్మ్ చేశారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రసంగించేందుకు స్పీకర్ అవకాశం ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. మహిళా విపక్ష ఎంపీలపై కూడా స్పీకర్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి, వారిని సస్పెండ్ చేసినట్లు ప్రేమ్‌చంద్రన్ ఆరోపించారు. ఈ అంశంలో తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఈ నేపథ్యంలో తాము అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నట్లు ఆ ఎంపీ వెల్లడించారు.సభను తమ తొత్తుగా భావిస్తూ నడిపిస్తున్నారని, ఇది ఆమోదయోగ్యం కాదు అని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ తెలిపారు. వారం రోజుల క్రితం లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ.. గాల్వాన్ ఘర్షణ గురించి మాజీ ఆర్మీ చీఫ్ నరవాణే రాసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన విషయం తెలిసిందే. దీంతో సభలో అప్పటి నుంచి గందరగోళం కొనసాగుతూనే ఉన్నది. అయితే ప్రచురణ కాని పుస్తకం

-మిగతా 2 లో

## రాజకీయాలు కాదు.. అభివృద్ధి ముఖ్యం

- మధిరను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా
- ఎన్నికల ప్రచార సభలో డిప్యూటి సిఎం భట్టి



ఖమ్మం, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
మధిర పట్టణ రూపురేఖలను పూర్తిగా మార్చే బాధ్యత తనదేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మధిరలో అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, హైదరాబాద్ తరహాలో మోడరన్ మహాప్రస్థానం శ్మశానవాటిక నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నా మని తెలిపారు. మధిరకు కావాల్సింది రాజకీయాలు కాదని, కేవలం అభివృద్ధి మాత్రమేనని భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. ఖమ్మం జిల్లాలోని మధిర మున్సిపాలిటీలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా భట్టి విక్రమార్క భారీ రోడ్ షోలో పాల్గొన్నారు.

-మిగతా 2 లో

## జీవితంలో ఏదీ సులువుగా ఉండదు..

మొదటి తరువాయి

మారుస్తుందని చెప్పారు. ఏఐతో ఉద్యోగాలు పోతాయన్న భయాలు నిజమేనా..? అన్న ప్రశ్నకు సాంకేతికత మన పనితీరును మెరుగుపరుస్తుందని చెప్పారు. దాన్ని సరిగ్గా వినియోగించుకుంటే ఏఐకి విద్యార్థులు భయపడాల్సిన పనిలేదన్నారు. టెక్నాలజీతో ఎలా పనిచేయాలన్నది నేర్చుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. జీవితంలో ఏదీ సులువుగా ఉండదన్నారు.విద్యార్థులకు ఐదు ట్రావెల్ డెస్టినేషన్స్ చెప్పండి..? అని అడుగగా.. ముందు మన సొంత ప్రాంతాలపై దృష్టిపెట్టాలని చెప్పారు. మన జిల్లా, నగరం, రాష్ట్రంలో ఉన్న ముఖ్యమైన ప్రాంతాల జాబితాను రాసుకోవాలన్నారు. ఆ తర్వాత ఎక్కడికి వెళ్లాలో ఎంచుకోవాలని చెప్పారు. అనంతరం మన సమీపంలో ఉన్న ప్రాంతాల విశిష్టతను తెలుసుకుంటే, అది భవిష్యత్తులో ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు.మంచి నాయకుడిగా ఎలా మారాలి..? అన్న ప్రశ్నకు మన విధివిధానాలకు ఎన్నటికీ భయపడకూడదని చెప్పారు. విధేయత, నిబద్ధతతో పనిచేయాలన్నారు. నిలకడగా సరైన పని చేయడమే నిజమైన నాయకత్వమని చెప్పారు. లీడర్‌షిప్‌నకు ముఖ్యమైన లక్షణం మీ ఆలోచనలను కనీసం 10 మందికైనా స్పష్టంగా తెలియజేయగలడమని అన్నారు.మెదడు ఆరోగ్యంగా పనిచేయాలంటే కంటినిండా నిద్రపోవాలని ప్రధాని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు జీవితాన్ని కూడా ఆస్వాదించాలని పేర్కొన్నారు. ఆత్మవిశ్వాసంగా ఉండటం చాలా ముఖ్యమని, అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలమని ప్రధాని తెలిపారు.

## మేం ఎవరికీ భయపడం

మొదటి తరువాయి

అణు కార్యక్రమంపై భవిష్యత్ సంప్రదింపులకు బాటలు వేసేందుకే ఇరు దేశాలు ఈ చర్చల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది. అయితే ఇదే సమయంలో గల్ఫ్ ప్రాంతంలో అమెరికా తమ సైనిక మోహరింపును పెంచుతోంది. అణు ప్రణాళికలకు సంబంధించి ఇరాన్‌పై ఒత్తిడి పెంచే ఉద్దేశంతోనే ఈ మోహరింపులు చేపట్టినట్లు తెలుస్తోంది.ఒకవేళ చర్చలు విఫలమైతే దాడులకు దిగుతామని ఈ సైనిక మోహరింపు ద్వారా అగ్రరాజ్యం సంకేతాలిచ్చింది. ఈ పరిణామాలతో మధ్యప్రాచ్యంలో పరిస్థితులు మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారాయి

## పదేళ్లలో చేయని అభివృద్ధి ఇప్పుడెలా చేస్తారు

మొదటి తరువాయి

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో కేసీఆర్ వరి వేస్తే ఉరేనని చెప్పారని.. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సన్నబియ్యం పండించే రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ డబ్బులు కూడా చెల్లిస్తున్నామన్నారు. 'ప్రస్తుతం ఉన్నది దొరల పాలన కాదు.. బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీల సంక్షేమ ప్రభుత్వం' అన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం పంపిణీ చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా ఇవ్వకుండా కమిషన్ల కోసం రూ. లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టారని విమర్శించారు. మొదట విడతగా రాష్ట్రంలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని, ఏప్రిల్‌లో రెండో విడతతో పాటు మరో మూడు విడతల్లో ఇండ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. గత సర్కార్ మూతపడ్డ కోళ్లఫామ్స్, రైస్‌మిల్లుల్లో హాస్టళ్లు ఏర్పాటు చేస్తే.. తమ ప్రభుత్వం మాత్రం రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తోందన్నారు.

## రేవంత్ రెడ్డి జైలుకెళ్లడం ఖాయం

మొదటి తరువాయి

చేశారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఈ కేసులో జైలుకు వెళ్లకుండా ఉండేందుకే సాక్ష్యాలను మాయం చేశారంటూ తెలంగాణ సీఎంపై ఆయన మండిపడ్డారు. ఈ ఫోరెన్సిక్ ల్యాబొరేటరిలో జరిగిన ఈ ప్రమాదం ప్రమాదవశాత్తు జరిగింది కాదన్నారు. ఇది సీఎం రేవంత్ డైరెక్షన్‌లో జరిగిందంటూ ఆయన బల్లగుద్ది చెప్పారు. ఈ ప్రమాదం వెనుక సీఎం రేవంత్ రెడ్డి హస్తం ఉందన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికిపోయిన దొంగ అంటూ రేవంత్‌ని వ్యాఖ్యానించారు. జైలుకు పోయే సమయం ఆసన్నమైందని.. అందుకే సాక్ష్యాలు మాయం చేసేందుకు హైద్రాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దగ్ధం చేశారంటూ రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. పోలీసుల సహకారంతోనే సీఎం ఈ కుట్రపన్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ డైరెక్షన్‌లోనే పోలీసులు చేసిన దహనఖాండ ఇది అని అభివర్ణించారు. రెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది గుండు సున్నా అని రేవంత్ పాలనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సర్‌'కు అడ్డంకులు కల్పించవద్దు..

మొదటి తరువాయి

వివాహం తర్వాత మహిళల చిరునామాలలో మార్పు వంటి చిన్న లోపాలను సాకుగా చూపి ఓట్లు తొలగిస్తున్నారని ధర్మాసనానికి తెలిపింది. సర్ ప్రక్రియవల్ల 1.36 కోట్ల మంది ఓటర్లు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. తమ స్థానికతను నిరూపించుకోవడానికి ఓటర్లకు ఈసీ ఒక్క అవకాశమూ ఇవ్వలేదని బెంగాల్ సర్కార్ న్యాయస్థానానికి తెలియజేసింది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ రాష్ట్రంలో ఓటర్ల దరఖాస్తులు పూర్తి చేయడానికి, డేటాను ఖరారు చేయడానికి గడువును ఒక వారం పొడిగిస్తున్నట్లు వెల్లడించింది.

## స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం..

మొదటి తరువాయి

నుంచి వ్యాఖ్యలు చేయవద్దు అని రాహుల్ గాంధీని స్పీకర్ కోరారు. వాస్తవానికి లోక్‌సభలో విపక్ష సభ్యుల సంఖ్య నామమాత్రమే. కానీ స్పీకర్‌పై వ్యతిరేకతను వ్యక్తం చేసేందుకు తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు విపక్షాలు చెబుతున్నాయి. లోక్‌సభకు రావొద్దు అని శుక్రవారం ప్రధాని మోదీని తానే చెప్పినట్లు స్పీకర్ బిర్లా పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం ఇంకా లోక్‌సభలో కొనసాగుతున్నది. రాహుల్ గాంధీ మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కూడా విపక్షాలు డిమాండ్ చేశాయి. సోమవారం ఉదయం విపక్షాలు ఆందోళన చేపట్టడంతో సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు.ఇక 2024 డిసెంబర్‌లో రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్‌కడ్‌పై విపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. 14 రోజుల నోటీసు సమయం ఇవ్వకుండా అకస్మాత్తుగా నోటీసు ఇచ్చినందుకు దాన్ని డిప్యూటీ చైర్మెన్ తిరస్కరించారు. ధన్‌కడ్ పేరును కూడా సరిగా ప్రచురించలేదన్నారు.

# రెండేళ్ల అభివృద్ధిని చూసి ఓటేయండి

మొదటి తరువాయి

బిజెపి అధ్యక్షుడు ప్రచారంలో పాల్గొన్నా రాష్ట్రానికి ఒక్క పైసా ఉపయోగం లేదన్నారు. ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా నిలుస్తూ భారీగా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి దక్కాల్సిన వాటాలో తీవ్ర అన్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలను చిన్నచూపు చూస్తూ ఉత్తరాది రాష్ట్రాలకు కేంద్రం పెద్దపీట వేస్తోందని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా పన్నుల పునఃపంపిణీలో కేంద్రం అనుసరిస్తున్న తీరును ఆయన గణాంకాలతో సహా ఎండగట్టారు. తెలంగాణ నుంచి కేంద్రానికి వెళ్తున్న ప్రతి రూపాయికి ప్రతిఫలంగా రాష్ట్రానికి కేవలం 42 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని, ఇది రాష్ట్ర ప్రయోజనాలపై గొడ్డలి పెట్టు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర పన్నుల వాటా పంపిణీలో ఉత్తరాది రాష్ట్రాలకు అందుతున్న నిధులపై సీఎం రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు. తెలంగాణ వంటి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రానికి నుంచి నిధులను సేకరించి, ఇతర రాష్ట్రాలకు కట్టబెడుతున్నారని ఆయన విమర్శించారు. ఉత్తరప్రదేశ్ రూపాయి పన్ను చెల్లిస్తే కేంద్రం ఆ రాష్ట్రానికి 2 రూపాయలు తిరిగి ఇస్తోందని, ఇక బీహార్ విషయానికొస్తే రూపాయికి బదులుగా ఏకంగా 6 రూపాయలు నిధులుగా వెళ్తున్నాయని ఆయన వివరించారు. ఈ స్థాయి వివక్షపై తెలంగాణ నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడైనా పార్లమెంట్‌లో నోరు మెదిపారా అని ఆయన నిలదీశారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలను గెలిపించినందుకు తెలంగాణకు మీరు చేసిన మేలేమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పైకి విమర్శలు చేసుకుంటున్నప్పటికీ, లోపల మాత్రం ఆ రెండు పార్టీలు ఒక్కటేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో కేంద్రం ప్రవేశపెట్టిన వివాదాస్పద రైతు వ్యతిరేక చట్టాలకు బీఆర్ఎస్ బేషరతుగా మద్దతు తెలిపిందని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా, నోట్ల రద్దు



సమయంలో కేసీఆర్ అసెంబ్లీని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి మరీ ప్రధాని మోదీని అభినందించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. మోదీ ప్రేమలో అమరత్వం పొందుతానని గతంలో కేసీఆర్ చెప్పలేదా అని ఆయన ఎద్దేవా చేశారు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగినట్లుగా వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధం బయటపడదని అనుకుంటున్నారని, కానీ బీఆర్ఎస్ , బీజేపీ మధ్య పక్కాగా 'క్విడ్ ప్రో కో' ఒప్పందం నడుస్తోందని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అత్యంత ఖరీదైన ఫార్ములా-ఈ కారు రేస్ అక్రమాలకు సంబంధించిన ఫైల్స్ ఈడీ వద్ద ఉన్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవినీతిపై సీబీఐకి ఫిర్యాదు చేసినా కేంద్రం ఉదాసీనంగా వ్యవహరించడం వెనుక ఉన్న మర్మమేమిటని అడిగారు. బీఆర్ఎస్ నాయకులను కాపాడేందుకే బీజేపీ ఈ కేసులను అటకెక్కించిందని రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం తన ప్రభుత్వం పోరాటం కొనసాగిస్తుందని, కేంద్రం నుంచి రావాల్సిన ప్రతి పైసాను సాధించుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తును ఆలోచించుకొని ఓటు వేయాలని ప్రజలను కోరారు. 12 ఏళ్లుగా కేంద్రంలో ఉన్న భాజపా.. తెలంగాణకు ఏమైనా ప్రాజెక్టులు మంజూరు చేసిందా? అని ప్రశ్నించారు.పాలమూరు-రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తామని ప్రధాని మోదీనే స్వయంగా హామీ ఇచ్చారు. వాటి గురించి చెప్పట్లేదు.. కానీ, మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. వరదల్లో నీటమునిగిన వస్తువులన్నీ కేంద్రం నుంచి నిధులు తెచ్చి తిరిగిస్తామని గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బండి సంజయ్ హామీ ఇచ్చారు. ఆ హామీని నమ్మి ఆ పార్టీకి చెందిన 50 మందిని కార్పొరేటర్లుగా గెలిపించారు. ఎన్నికలయ్యాక అడిగితే.. వస్తువులకు బీమా ఉంటుందని బండి సంజయ్ మాటమార్చారు. తెలంగాణకు రూ.లక్షల కోట్లు ఇచ్చామని భాజపా నేతలు చెబుతున్నారు. దీనిపై సీఎస్‌ను వివరణ అడిగితే.. మనం రూపాయి చెల్లిస్తే.. కేంద్రం 42 పైసలు ఇస్తోందని చెప్పారు. కేంద్రానికి వచ్చే పన్నుల్లో దక్షిణాది రాష్ట్రాలే 40 శాతానికి పైగా చెల్లిస్తున్నాయి. తెలంగాణకు వచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేశారు. హైదరాబాద్‌కు వచ్చిన సెమీకండక్టర్ ప్రాజెక్టును మోదీ ఒత్తిడి చేసి.. ఏపీకి తరలించారు. ఇప్పుడు మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. అసలు మున్సిపల్ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధం? భాజపా నేతలకు దేవుడు అసదుద్దీన్ ఒవైసీ. ఆయన పేరు లేకుండా ఆ నేతల ప్రచారం ఉండదు. మత రాజకీయాల ద్వారా భాజపా రాజకీయ మనుగడ సాగిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇకపోతే తెలంగాణ కోరిన మూసీ రివర్ ఫ్రంట్, ట్రిపుల్ ఆర్, మెట్రో విస్తరణ వంటి పథకాలపై ఎలాంటి కదలిక లేదన్నారు. అయితే తెలంగాణ అభివృద్ధికి తాము రెండేళ్లలో అనేక పనులు చేపట్టామని అన్నారు.

# ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారపర్వం

మొదటి తరువాయి

మార్మోగిన వీధులన్నీ ఇప్పుడు నిశ్శబ్దంగా మారాయి. ఫిబ్రవరి 11న జరగనున్న పోలింగ్‌లో ఓటర్లు ఎవరికి పట్టం కడతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ ఎన్నికల్లో ఓటర్ల బలం గణనీయంగా ఉంది. మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించు కోవడానికి మొత్తం 52,43,023 మంది ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. ఇందులో పురుష ఓటర్ల సంఖ్య 25,62,639 కాగా, 26,80,014 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం ఈ ఎన్నికల్లో కీలక పరిణామంగా కనిపిస్తోంది. వీరితో పాటు మరో 640 మంది ఇతర ఓటర్లు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,195 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఈ ఎన్నికల కోసం 16,031 బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేశారు. పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు 1,379 మంది రిటర్నింగ్ ఆఫీసర్లు (ఖీక్ష), 1,547 మంది సహాయ రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించారు. క్షేత్రస్థాయిలో 9,560 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు (ఖక్ష), 31,428 మంది ఇతర సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరచడానికి 137 స్టాంరగ్ రూమ్‌లు, ఫలితాల లెక్కింపు కోసం 136 కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రభుత్వం భారీ భద్రతను ఏర్పాటు చేసింది. సుమారు 25,000 మంది పోలీసు సిబ్బందితో రాష్ట్రవ్యాప్తంగా నిఘా పెంచారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించారు. ఎన్నికల పక్రియలో పూర్తి పారదర్శకతను పాటించేందుకు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ కాస్టింగ్ సదుపాయాన్ని కల్పించారు. దీని ద్వారా ఎన్నికల సంఘం అధికారులు నేరుగా పోలింగ్ సరళిని పర్యవేక్షించవచ్చు. మొత్తం 12,993 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న ఈ ఎన్నికల్లో గెలుపు ఎవరిని వరిస్తుందో చూడాలి. ఫిబ్రవరి 11న పోలింగ్ ముగిసిన తర్వాత, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. ఆ తర్వాత ఫిబ్రవరి 14న మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్లతో పాటు మున్సిపల్ చైర్మన్ డిప్యూటీ చైర్మన్ల ఎన్నిక పక్రియ జరుగుతుంది. చివరగా ఫిబ్రవరి 16న కొత్తగా ఎన్నికైన వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం, ప్రత్యేక సమావేశంతో ఈ ఎన్నికల పక్రియ పూర్తి కానుంది.

# రెండేళ్ల తరవాత మళ్లీ అధికారం మాదే

మొదటి తరువాయి

హామీలు అమలు చేయాలని బరాబర్ అడుగుతామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ వెంటపడుతూనే ఉంటామని తెలిపారు. అబద్ధపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల్లో గెలిస్తే కల్యాణలక్ష్మి డబ్బులతో పాటు తులం బంగారం ఇస్తానని అబద్దాలు చెప్పిండని అన్నారు. కానీ ఇప్పుడు మొఖం బాగోలేక అద్దం పగులగొట్టినట్లుగా రేవంత్ రెడ్డి తీరు ఉందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఉన్నప్పుడు డిసెంబర్‌లోనే రైతుబంధు పడేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఫిబ్రవరి వచ్చినా రైతుబంధు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. భూపాలపల్లి జిల్లాను రద్దు చేయనని రేవంత్ రెడ్డి అంటున్నాడని కేటీఆర్ తెలిపారు. నువ్వు పెట్టినవా తీసేయడానికి.. రెండేళ్లలో ఈ పొట్టోడు ఏం పీకిండని ప్రశ్నించారు. జిల్లాను రద్దు చేస్తే నీ వీపు చింతపండు చేస్తారని హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లాను తెచ్చింది అభివృద్ధి చేసింది కేసీఆర్ అని తెలిపారు. సింగరేణి కాంట్రాక్టులను రేవంత్ రెడ్డి తన బామ్మర్దికి





కట్టబెట్టిండని పేర్కొన్నారు. బొగ్గు కుంభకోణం బయటపెట్టామని ఫేక్ నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఓటుకు నోటు కేసులో ఆధారాలు ఉండకూడదని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో నిప్పు పెట్టి తగులబెట్టారని మండిపడ్డారు. తెలంగాణను ఆగం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని గల్లా పట్టుకుని అడగండని ఓటర్లకు పిలుపునిచ్చారు. తులం బంగారం ఎప్పుడిస్తావని అడగాలన్నారు. రేవంత్ రెడ్డికి ఓటుతోనే కర్రుకాల్చి వాత పెట్టాలన్నారు. బూతుల ముఖ్యమంత్రికి పోలింగ్ బూత్‌లోనే బుద్ధి చెప్పాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి అన్ని వార్డుల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఇదిలావుంటే అసలు కాంగ్రెస్ వాళ్లు మసకబడితే నకిలీ తెలుగుదేశపోడు ముఖ్యమంత్రి అయ్యిండని రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జయశంకర్ భూపాలపల్లిలో కేటీఆర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో అసలైన కార్యకర్తలు, నాయకులకు విలువ లేదన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ వాళ్ల మీద పెత్తనం చేసుకో అంతే కానీ కేసీఆర్‌ను ఒక్క మాటంటే బిడ్డా ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమన్నారు.

# రాజకీయాలు కాదు.. అభివృద్ధి ముఖ్యం

మొదటి తరువాయి

ఈ సందర్భంగా ఆయన మధిర పట్టణ అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత 10 సంవత్సరాలుగా మధిర మున్సిపాలిటీలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో మధిర మున్సిపాలిటీలోని అన్ని వార్డులను కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అభ్యర్థుల గెలుపు రాజకీయాల కోసం కాదని.. అభివృద్ధి కోసమే అని చెప్పారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్-టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. డబ్బు ప్రధానం కాదని.. అభివృద్ధే



ప్రధానమని, వ్యక్తులకన్నా వ్యవస్థలే ముఖ్యమని డిప్యూటీ సీఎం వివరించారు. మధిర మున్సిపాలిటీని రాష్ట్రానికి మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. ఏ అవసరం ఉన్నా ప్రజలందరికీ అండగా నిలుస్తానని చెప్పారు. విజ్ఞులైన ప్రతి ఒక్కరూ మధిర అభివృద్ధిపై తమ ఆలోచనలు పంచుకోవాలని కోరారు. మహిళలను వడ్డీలేని రుణాలతో స్వయం ఉపాధి వ్యాపారస్తులుగా తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# ఫిబ్రవరి 11న ఓటు హక్కు వినియోగించుకోవాలి

## - జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఫిబ్రవరి 11న జిల్లాలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలు మరియు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి వాణిజ్య, దుకాణం, వ్యాపార సంస్థలలో పని చేసే కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీహర్ష ఆదేశాలు జారీ చేశారు.ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది కూడా తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునేలా వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని, ఆ సమయంలో షిఫ్ట్‌లో ఉన్న ఉద్యోగులకు కూడా సెలవు కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.తెలంగాణ షాప్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 1988 ప్రకారం యజమానులు తమ సంస్థలను మూసివేసి కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వడం తప్పనిసరి. ఈ ఆదేశాలను పాటించని యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి హెచ్చరించారు.ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, కార్మికులు, ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఎంపీ వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన శ్రీమాత డెవలపర్స్ చైర్మన్ కాసర్ల రాజు



**పెద్దపల్లి, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పట్టణానికి చెందిన శ్రీమాత డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ కాసర్ల రాజు సోమవారం న్యూ ఢిల్లీలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించగా, ఎంపీ వంశీకృష్ణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కాసర్ల రాజు కృషి చేయాలని కోరారు. అనంతరం కాసర్ల రాజు మాట్లాడుతూ, తనను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించినందుకు ఎంపీకి కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీకి పూర్తి విధేయుడిగా ఉంటానని, పలు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటానని తెలిపారు.కాసర్ల రాజుతో పాటు శ్రీమాత డెవలపర్స్ డైరెక్టర్లు కోట మల్లేష్, బొడ్డు సుమన్, బొడ్డుపల్లి రవి, బండ రాజయ్య, వేల్పుల రమేష్, ఓ శ్రీధర్, సంపత్, సురేష్, శ్రీనివాస్, మల్లేష్, సతీష్ కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్లం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయు డిమాండ్



**ఉప్పునుంతల, ఫిబ్రవరి 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా ఆటో రవాణా రంగ కార్మికులు ఉప్పునుంతల మండలంలో తమ డిమాండ్లను అధికారులకు తెలియజేశారు. తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో ఆటో కార్మికులు, వాహన కార్మికులు కలిసి మండల తాసిల్దార్‌కు సమ్మె నోటీసులు అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి చింతల నాగరాజు మాట్లాడుతూ, ఆటో రవాణా రంగ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కార్మికులకు ఉపయోగపడే విధంగా మోటార్ వాహన చట్టం 2019ను సవరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని, కార్మికుల హక్కుల కోసం అందరూ ఏకమవ్వాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు ఆటో యూనియన్ కార్మికులు జగన్, భాస్కర్, గణేష్, శేఖర్, బాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా భోలశంకరుడి శోభాయాత్ర



**గంగాధర, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండలం మధురానగర్‌లో లయకారకుడైన శ్రీ రాజరాజేశ్వర స్వామి శోభాయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. శివదీక్ష స్వాములు సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆనందగిరి అయ్యప్ప స్వామి ఆలయం నుండి ఊరేగింపును ప్రారంభించారు. గ్రామంలోని నలుమూలల వీధులలో శోభాయాత్ర కన్నుల పండువగా కొనసాగింది.శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ శోభాయాత్రలో శివనామస్మరణతో పరిసరాలు మార్మోగాయి. శివ స్వాములు, భక్తులు, నృత్యాలు, శివతాండవంతో ఊరేగింపులో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో స్వాములు బస్మాధారణలో అఘోరాలను తలపించేలా త్రిశూలం, డమరుకాలను చేత పట్టుకొని ప్రత్యేక ఆకర్షణలతో తాండవం చేశారు. భోళాశంకరుని అనుగ్రహం కోసం భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. స్వామివారికి హారతులు సమర్పించి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. హరహర మహాదేవ... శంభో... శంకర... అంటూ శివనామస్మరణలతో పురవీధులు మారుమోగాయి. సాంప్రదాయ నృత్యాలు, శివతాండవం ప్రదర్శిస్తూ స్వాములు శోభాయాత్రకు జోష్‌ను జోడించారు. పరమశివుని శోభాయాత్ర భక్తిభావాలను మరింతగా పెంచి, అందరినీ ఆకట్టుకుంది.శివుడు విశ్వవ్యాప్తుడు. ఆయన కేవలం కైలాసపర్వతంలోనే కాదు, భక్తుల మనస్సులో కూడా ఉంటాడు. ఆయన కాలానికి అతీతుడు. కాలమన్నదే ఆయనలో నుండి ఉద్భవించింది. అందుకే శివునికి ఆది, అంతం ఉండవు. భక్తులు ఆయనను ఏ రూపంలో పూజించినా, ఆ తండ్రి వారికి ప్రసన్నమవుతాడనే విశ్వాసంతో ఈ శోభాయాత్రలో పాల్గొన్నారు.భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గంగాధరలో జరిగిన ఈ శోభాయాత్ర భక్తి, వైభవం, సాంప్రదాయాల సమ్మేళనంగా నిలిచింది.

# పురపాలక ఎన్నికల ప్రచారంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు




**పెద్దపల్లి, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే పట్టణాలు మరింత అభివృద్ధి చెందుతాయని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జెండా చౌరస్తా వద్ద సోమవారం జరిగిన యుద్ధభేరి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.మంత్రి మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టి పట్టణాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. గూడులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆశ్రయం కల్పించామని, త్వరలోనే ఇంటి స్థలాలను కేటాయించి గేటెడ్ కమ్యూనిటీ కాలనీ ఏర్పాటుకు చర్యలు చేపడతామని వెల్లడించారు.పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఐటీ పార్కు ఏర్పాటు చేయబోతున్నామని, ఆటో కార్మికుల కోసం ఆటో నగర్ నిర్మాణానికి స్థల సేకరణ జరుగుతోందని ప్రకటించారు. రాష్ట్రంలో సీఎంఆర్ఎఫ్ మంజూరులో పెద్దపల్లి అగ్రస్థానంలో నిలిచిందని, అందుకు స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు కృషి కారణమని అన్నారు. రూ. కోటితో అంబేద్కర్ స్టడీ కోచింగ్ సెంటర్, అత్యాధునిక సౌకర్యాలతో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణం జరుగుతోందని వివరించారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని, అర్హులైన రైతులందరికి రూ.2 లక్షల రుణమాఫీ అందించామని, సన్న వడ్లకు రూ.500 బోనస్ చెల్లించిన ఘనత కాంగ్రెస్ సర్కారుదేనని గుర్తు చేశారు. పెద్దపల్లి మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధైర్యంగా ప్రకటించారు.ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ, పట్టణాభివృద్ధికి రూ.92 కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించామని, మరో రూ.22 కోట్లు కూడా మంజూరు చేయించామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల్లా పరిగెత్తిస్తున్నామని వివరించారు. 36 మంది కాంగ్రెస్ అభ్యర్థులను కౌన్సిలర్లుగా గెలిపించే బాధ్యత ప్రజలదేనని, పట్టణాభివృద్ధి బాధ్యత తాను తీసుకుంటానని అన్నారు.ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచిన వెంటనే పారదర్శకంగా, జవాబుదారితనంతో ప్రజలకు సేవ చేసి గుర్తింపు పొందాలని సూచించారు. పట్టణాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎన్నికల ఇన్‌చార్జి బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జడ్.పి.హెచ్.ఎస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





**అమ్రాబాద్, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

అమ్రాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 1994--95 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు, తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, అమ్రాబాద్ పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ప్రతి సంవత్సరం ఇలాగే కలుసుకోవాలని తీర్మానం చేశారు. అందుకోసం ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్‌ను సృష్టించారు. చదువుకున్న రోజుల్లో ఆర్థికంగా వెనుకబడిన సహ విద్యార్థులను ఆదుకోవాలని కూడా నిర్ణయించారు.అప్పుడు వారికి బోధించిన గురువులు జగాల్ రెడ్డి, వేణుగోపాల్ శర్మ, వెంకట్ రెడ్డి, రఘుపతిరావు, శ్రీనివాసులు తదితరులను ఘనంగా సన్మానించారు. గురువుల పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేస్తూ, వారి మార్గదర్శకత్వమే తమ జీవితాల్లో విజయానికి పునాది అయిందని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చంద్రయ్య, శేఖర్, గోలి మల్లేష్, జాంగిర్ వెంకటయ్య, ఆనంద్, పాండు, సుధాకర్, హాజీ తదితరులు పాల్గొన్నారు. చిన్ననాటి స్నేహాలను తిరిగి గుర్తుచేసుకుంటూ, ఆనందోత్సాహాలతో సమ్మేళనం సాగింది.

# చెరువు నీళ్లకు అడ్డుకట్టలు వేయడంపై డీఈ కీర్తి కుమారి ఆగ్రహం



**పాలకుర్తి, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామ ఎరుకలి చెరువు నుండి ఈశాల తక్కల్లపల్లి గ్రామ పెద్ద చెరువులోకి నీళ్లు రాకుండా వారం క్రితం గ్రామస్తులు కట్టు కాలువలో మట్టి పోసిన ఘటనపై ఈశాల తక్కల్లపల్లి గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్ ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు.దీంతో సోమవారం పాలకుర్తి మండల ఇరిగేషన్ అధికారి డీఈ కీర్తి కుమారి కాలువలో మట్టి పోసిన ప్రాంతాన్ని పరిశీలించారు. చెరువుల మధ్య నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడం సరైంది కాదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పంటలకు సరిపడా ఎస్సారెస్పీ నీళ్లతో చెరువులను నింపేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వివరించారు.రెండు గ్రామాల మధ్య ఏవైనా విబేధాలు ఉంటే సామరస్యంగా చర్చించుకోవాలని, చట్టవ్యతిరేకంగా నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడం వంటి చర్యలు చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంటనే అడ్డుకట్టలను తొలగించాలని కొత్తపల్లి గ్రామస్తులను డీఈ కీర్తి కుమారి కోరారు.ఈ ఘటనతో స్థానికంగా చర్చనీయాంశం ఏర్పడగా, అధికారులు ప్రజలకు నీటి వనరుల వినియోగంలో పరస్పర సహకారం అవసరమని సూచించారు.

## నిర్బంధ ఓటింగ్ విధానం తోనే

# ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది







భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శం. ప్రజాస్వామ్యానికి మూల స్తంభం ఎన్నికల వ్యవస్థ. భారత రాజ్యాంగం 326 ఆర్టికల్ ద్వారా కుల 'మత' ప్రాంత 'లింగ 'జాతి బాషా 'అనే భేదం లేకుండా అక్షరాస్యులుకు' నిరక్షరాస్యులకు 18 సంవత్సరాల వయస్సు నిండిన భారత జాతీయ పౌరులకు వయోజన ఓటు హక్కును కల్పించింది .

**ప్రపంచ రాజకీయ చరిత్రలో గొప్ప విప్లవాత్మకమైన మార్పు ఓటుహక్కు**

ప్రపంచ రాజకీయ చరిత్రలో ఓటు హక్కు గొప్ప విప్లవాత్మకమైన మార్పు. అభివృధి చెందిన దేశాల కంటే ముందే మన దేశంలో వయోజన ఓటు హక్కును భారత రాజ్యాంగం కల్పించి ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది వేసింది.ఓటు హక్కుతో ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేసే అవకాశం పౌరులందరికీ కల్పించింది . ఐదేళ్లకు ఒక సారి జరిగే సార్వత్రిక / స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు హక్కును వియోగించుకోవడం తో పాటు తాము కోరుకున్న పాలనను ప్రజలే తెచ్చుకోవచ్చు.

**మన భవిష్యత్తు మన చేతిలోనే ఉంది**

అన్న విషయాన్ని ఓటు చాటుతుంది . ఓటు రూపంలో భవిష్యత్తుకు మనమే బాట వేసుకునే అవకాశాన్ని రాజ్యాంగం కల్పించింది.ఓటు అనే రెండు అక్షరాలు దేశ చరిత్రను మార్చి వేస్తుంది. ప్రభుత్వాలను కూలదొస్తుంది. ఓటు తూటా కంటే గొప్పది .

**ఓటుహక్కు వజ్రాయుధం**

ఓటు హక్కు వజ్రాయుధం .ఓటు హక్కును వినయోగించు కోవడం ప్రజల ప్రధాన కర్తవ్యం. ఓటు హక్కుపై విస్తృత ప్రచారంచెయ్యాలి. కుల మతాలకు అతీతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి.

**ఓటుహక్కు వినియోగం సార్వత్రిక ఎన్నికలు**

భారత దేశములో 2023 జనవరి 1 నాటికి నమోదైన మొత్తం ఓటర్ల సంఖ్య 95 '50 '25'694 చేరింది.

దేశంలో జనభాతో పాటు ఓటర్ల సంఖ్య పెరుగుతుంది. ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచటానికి ఎన్నికల కమిషన్ తీసుకున్న చర్యలు పోలింగ్ శాతం పెంచడంలోవిపలమైనాయి. .ఓటర్లలో 3 వ వంతు పోలింగ్ కు దూరంగా ఉంటున్న స్థితి కొనసాగుతుంది.

దేశంలో1951 నాటికి నమోదైన ఓటర్ల సంఖ్య 68 కోట్లు' 2023 నాటికి 94.50 కోట్లకు పెరిగింది .

యువకులు' పట్టణ నగర ప్రాంతాలలో ఓటర్లు పోలింగులో పాల్గొనడం లేదు. గత లోకసభ సార్వత్రిక ఎన్నికల్లో 3 వవంతు ఓటర్లు పోలింగుకు దూరంగా ఉన్నారని ఎన్నికల **కమిషన్ పేర్కోవడం గమనార్హం**

దేశములో 1951 లో నమోదైన ఓటర్లు 17.32 కోట్లు వుండగా 45.57 శాతం ఓటర్లు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. దశాబ్దాలుగా దేశంలో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగిన ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్ల సంఖ్య పెరుగుక పోవడం శోచనీయం.

1957 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య19.37 కోట్లు ఉండగా అందులో 47.74 శాతం ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నరు.

ఓటర్ల పోలింగ్ శాతాన్ని 75 శాతానికి పెంచటానికి ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తుంది.

2014 లో దేశంలో నమోదైన ఓటర్ల సంఖ్య 83.4 కోట్లు పోలింగ్ శాతం 66.44 వుంది.2019 లో లోకసభకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నమోదైన మొత్తం ఓటర్ల సంఖ్య 91.2 కోట్లు పోలింగ్ శాతం 67.4.శాతం మించలేదు. 2019 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 30 కోట్ల మంది పోలింగ్ బూతుకు వెళ్లలేదని ఓటు హక్కు వినియోగించుకోలేదని ఎన్నికల కమిషన్ నిర్ధారించింది.

పట్టణ నగర ప్రజలు యువకులు విద్యావంతులు వలస కార్మికులు ఓటువేయని వారిలో ఉన్నారని తేలింది.గతంలో హిమాచల్ ప్రదేశ్ గుజరాత్ అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో పట్టణ ప్రజలు పోలింగ్ లో పాల్గొనకుండా వున్న ఉదాసీన వైఖరిని ఎన్నికల కమిషన్ గుర్తించింది.

**ఉన్న చోటే ఓటు హక్కు వినియోగం రిమోట్ ఓటింగ్ విధానం**

, స్వరాష్ట్రంలో ఓటరుగా నమోదైన వారు వివిధ కారణాల వల్ల వేరువేరు చోట్లకు వలస వెళ్లిన క్రమంలో ఓటు హక్కు వినియోగించుకునే స్థితిలో లేరు.

వారి కొరకు రిమోట్ ఓటింగ్ విధానం నూతన సాంకేతికతను ఎన్నికల కమిషన్ ప్రతిపాదించింది.

వినూతనమైన కమ్యూనికేషన్ వ్యూహాల మీద ఎన్నికల కమిషన్ దృష్టిపెట్టింది.

**రాజకీయ ఏకాభిప్రాయం**

రిమోట్ ఓటింగ్ విధానం మీద దేశంలో వున్న జాతీయ ప్రాంతీయ పార్టీలు 'ఉప ప్రాంతీయ పార్టీల ఏకాభిప్రాయం రావాలి. ఎన్నికల కమిషన్ ప్రతిపాదించిన సంస్కరణలకు ఇచ్చిన సూచనలకు రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయం వ్యక్తం చేసిన సంఘటనలు చాలా తక్కువగా ఉన్నాయి. 1962 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 55.42 శాతం ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు 2009 లో జరిగిన ఎన్నికల్లో 71.70 శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం ఓటర్లు 91.20 కోట్లు ఉండగా 67.40 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**ప్రస్తుతం తెలంగాణలో ఓటర్ల వివరాలు**

పురుషులు 15048250 స్త్రీలు ... 14924718 థర్డ్ జెండర్.1951ఎన్ ఆర్ ఐ 2740 రక్షణ రంగములో పనిచేసే సేవారంగం 15282

మొత్తం 2 99 92941 వున్నారు. ఓటర్లను తమ ఓటు హక్కు వినియోగం మీద పోలింగ్ బూతుల వారిగా అవగాహన చైతన్యం కలిగించాలి.

**ఎన్నారై ఓటర్లు ఆన్లైన్ ఓటింగ్**

ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలో 2.2 కోట్ల మందికి పైగా ఎన్ 'ర్ ' ఐ ఓటర్లు ఉన్నట్లు అంచనా వీరికి త్వరలో ఒక చట్టం తేవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఆన్లైన్ ఓటింగ్ విధానం రిమోట్ ఓటింగ్ విధానం అమల్లోకి వస్తే

ఎన్ 'ఆర్ 'ఐ లు తమ వోటు హక్కును వినియోగించుకునే అవకాశం కలుగుతుంది.

**ఓటింగ్ శాతం పెంచడానికి తీసుకోవలసిన చర్యలు**

1)ఎన్నికల కమిషన్ నిరంతరం ఓటర్ల నమోదు కొత్తవోటర్ల చేరికలు డూప్లికేటే ఓటర్ల ను దొంగఓటర్లను ఓతర్ల జాబితా నుండి తొలగించే కార్యక్రమాన్ని సమర్ధవంతంగా చేపట్టాలి.

2)కళాశాల స్థాయిలో ఓటర్ల నమోదు కేంద్రాలను ఏర్పాటు చెయ్యాలి.

3)ఎలక్షన్ ట్రిసీ క్లబ్ లను నిర్వహించాలి.

**4)ఎన్నికల అక్షరాస్యత**

బలమైన ప్రజాస్వామ్యం కొసం ఎన్నికల అక్షరాస్యత పరివ్యాప్తిలో

యువజన 'మహిళా 'స్వశక్తి సంఘాలు' పౌర సమాజం స్వచ్ఛంధ ' సామాజిక సేవా సంస్థలు క్రియాశీలక పాత్ర పోషించాలి.

**5)నిర్బంధ ఓటింగ్ విధానం సంస్కరణలు చట్టాలు**

ప్రభుత్వం నిర్బంధ ఓటింగ్ విధానం అమల్లోకి తేవాలి.అందుకు అవసరమగు బిల్లు లోకసభలో ప్రవేశ పెట్టి సమగ్ర ఎన్నికల చట్టాలను రూపొందించాలి.

**భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వాక్య కనువిప్పు కావాలి**

భారత మాజీ రాష్ట్రతి అబ్దుల్ కలాం పేర్కొన్నట్లు మొత్తం ఓటర్లలో 90శాతంఓటింగ్ జరిగితే దేశం అభివృధి పథంలో ముందుకు సాగుతుంది అన్న వాక్య యువతకు పట్టణ ఓటర్లకు కనువిప్పు కావాలి.

**ఓటు విలువ పై విస్తృత ప్రచారం**

యువత ఓటువే యడం మీద ఆసక్తి చూపడం లేదు. ఓటు విలువ మీద విస్తృత స్థాయిలో ప్రచారం చెయ్యాలి. ప్రజాస్వామ్యానికి ఓటు వజ్రాయుధం.


గ్రామ సభ' పురపాలక 'నగర పాలక సంస్థలు ప్రతి 3.నెలలకు ఒక సారి ఓటు హక్కు వినియోగం ఓటు నమోదు దొంగ ఓటర్ల గుర్తింపు తొలగింపు మీద సమావేశాలు నిర్వహించి ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగం పై అవగాహన చైతన్యం కలిగించాలి.

**ఓటు హక్కు వినియోగం మీడియా**

మీడియా టివి సినిమా ప్రచార ప్రసార సాధనాలు మాధ్యమాలు ఓటు హక్కు వినియోగం ఓటు విలువ ఓటింగ్ విధానం పట్ల ప్రచారం చెయ్యాలి. ఓటరుగా వున్నందుకు గర్వపడుతున్నాను ఓటు వేయడానికి సిద్దంగా వున్నలి అనేది నినాదం కాకుండా ఓటర్ల విధానం కావాలి. లోకసభ' శాసన సభ 'స్థానిక సంస్థల ఎన్నికల్లో విధిగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలి.

ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా సమర్ధులైన అభ్యర్థులకు ఓటువేసి ఉత్తమ అభ్యర్థులను ఎన్నుకుంటామని ప్రతిజ్ఞ చెయ్యాలి.అప్పుడే ప్రజలచేత ప్రజల కొరకు ప్రజలు ఏర్పరుచుకున్న ప్రభుత్వం ఏర్పడుతుంది. బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రగతి పురోగతి' సంక్షేమం సిద్ధించి దేశ సర్వతోముఖాభివృద్ధి సాధ్యమౌతుంది.

నేదునూరి కనకయ్య
అద్యక్షులు
తెలంగాణ ఎకనమిక్ ఫోరం
మాజీ కరెస్పాండెంట్
జస్టిస్ కుమారయ్య
లా కాలేజీ కరీంనగర్
9440245771



## బండి శ్రీనివాస్ సమక్షంలో విజయవంతంగా మొదటి గ్రామసభ





**పాలకుర్తి, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పాలకుర్తి మండలం ఈసాల తక్కలపల్లి గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గం ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల అనంతరం మొదటి గ్రామసభ సమావేశాన్ని ఉత్సాహంగా నిర్వహించింది. సర్పంచ్ బండి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధి దిశగా పలు తీర్మానాలు చేపట్టారు.సర్పంచ్ మాట్లాడుతూ, గత రెండేళ్లుగా గ్రామ పాలన కుంటుపడిపోవడంతో సమస్యలు పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇకపై వాటిని పరిష్కరించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు.గ్రామసభలో రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అలాగే పారిశుద్ధ్యం, నాళాల శుభ్రత, విద్యుత్ దీపాల కొనుగోలు, గ్రామంలో అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని తీర్మానించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోడిజుట్టు సుభాష్, ఉప సర్పంచ్ ఒడ్నాల జ్యోతి రాజు, వార్డు సభ్యులు, అన్ని శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామసభలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

## ప్రతి పౌరుడు స్వేచ్ఛగా తన ఓటు హక్కును వినియోగించుకోవాలి

**- వలస సుభాష్**



**హుస్నాబాద్, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: రాష్ట్రంలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు ఫిబ్రవరి 11న జరగనున్న నేపథ్యంలో, ఓటర్లందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వలస సుభాష్ విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్ పట్టణంలో విలేకరులతో మాట్లాడిన ఆయన, ప్రజాస్వామ్యానికి ఓటే పునాదని, ప్రతి పౌరుడు స్వేచ్ఛగా తన ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రలోభాలకు లోను కాకుండా, ప్రజలకు మేలు చేసే అభ్యర్థులను ఎన్నుకోవాలని యువతను ప్రత్యేకంగా పిలుపునిచ్చారు. 100 శాతం ఓటింగ్ సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. ఓటు వజ్రాయుధం లాంటిదని, దాన్ని జాగ్రత్తగా వినియోగించుకోవాలని పౌరులకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఓటు కీలకమని అన్నారు.సంకల్ప సంస్థ గతంలో సిద్దిపేట జిల్లాలో లోకసభ, శాసనసభ ఎన్నికల సమయంలో యువత, మహిళా సంఘాలకు ఓటర్ చైతన్యంపై సైకిల్ యాత్రలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

## అట్టహాసంగా ప్రారంభం క్రికెట్ టోర్నమెంట్



**ఎలిగేడు, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

మండల కేంద్రంలో జి స్కిల్ డెవలప్మెంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ అట్టహాసంగా ప్రారంభమైంది.ఈ పోటీల్లో విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు ప్రకటించారు. మొదటి జట్టుకు రూ.10,000, రెండవ జట్టుకు రూ.7,000, మూడవ జట్టుకు రూ.5,000 నగదు బహుమతులు అందజేయనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ముంజంపల్లి రమేష్ తెలిపారు. అదనంగా మాన్ ఆఫ్ ది మ్యాచ్, మాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మన్ అవార్డులు గెలుచుకున్న వారికి ఒక్కొక్కరికి రూ.2,000 నగదు బహుమతులు అందజేయనున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ఎలిగేడు గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్, మాజీ ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వరరావు, ప్రభుత్వ పాఠశాల మాజీ పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు అడ్డగుంట తిరుపతి గౌడ్, వార్డు సభ్యుడు బ్రహ్మోజు మధు, నిర్వాహకులు బాసంపెల్లి వినోద్, ఏ.ప్రదీప్, బోయిని సత్యం, గంధం విక్రమ్, నాతరి సంపత్, శ్రీకాంత్, శంకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
మంగళవారం 10 ఫిబ్రవరి 2026

## ప్రజల్లో భరోసా కలిగించిన పోలీసుల ఫ్లాగ్ మార్చ్




**మహబూబాబాద్, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా భరోసా కలిగించేందుకు పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 4వ వార్డు గాంధీపురం, 5వ వార్డు అనంతారం, 10వ వార్డు వీరారం తండాలో ఆదివారం ఫ్లాగ్ మార్చ్ జరిగింది. ప్రజల్లో నమ్మకం కలిగిస్తూ, శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీసులు కదలికలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో రూరల్, కురవి, టౌన్ పోలీస్ స్టేషన్ సీఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ మరియు స్పెషల్ పార్టీ సిబ్బంది మొత్తం 80 మంది పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.


## నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

-- వార్డ్ ఇంచార్జ్ ఎల్లస్వామి



**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నేతలు విస్తృతంగా పర్యటించారు. 21వ వార్డు ఇంచార్జ్, తెలకపల్లి వార్డ్ మెంబర్ కొమ్ము ఎల్లస్వామి మాట్లాడుతూ, "నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయం" అని ధీమా వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి కోట్ల రూపాయల నిధులు తెచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని, ప్రజలు హస్తం గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం నాగర్‌కర్నూల్ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ఒక్క డబుల్ బెడ్రూమ్ ఇల్లు కూడా మంజూరు చేయలేదని గుర్తుచేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 80 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, 34 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ వంటి పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు.అలాగే దేశంలో ఎక్కడ లేని విధంగా ఏడాదికి రూ.13 వేల కోట్లు వెచ్చించి రేషన్ ద్వారా సన్న బియ్యం అందిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజలు అభివృద్ధి కోసం ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

## దుద్యాల మండల ఎంఈఓగా గందే శంకర్ నియామకం



**దుద్యాల, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండల విద్యాధికారిగా (ఎంఈఓ) గందే శంకర్ నియమితులయ్యారు. టీచర్ స్థాయి నుంచి గెజిటెడ్ హెడ్మాస్టర్‌గా, అక్కడి నుంచి తక్కువ కాలంలోనే ఎంఈఓ స్థాయికి ఎదగడం విశేషమని పలువురు అభిప్రాయపడ్డారు.రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గందే సురేష్ మాట్లాడుతూ, "ఇది ఎంతో గర్వకారణం. శంకర్ గారికి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు రావాలని కోరుకుంటున్నాం" అని అభినందించారు.ఫరూక్‌నగర్ మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ఎల్కుర్తి నారాయణ, మండల మాజీ అధ్యక్షుడు అనుమారి మురళీధర్, సామాజిక కార్యకర్త నీల రవీందర్, జిల్లా మెంబర్షిప్ కమిటీ చైర్మన్ మలిపెద్ది శ్రీనివాస్, అలాగే వివిధ పాఠశాలలో కలిసి పనిచేసిన ఉపాధ్యాయులు, మిత్రబృందం శంకర్ ని అభినందించారు.ఈ నియామకం దుద్యాల మండల విద్యా రంగానికి కొత్త ఉత్సాహాన్ని తీసుకువస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# ఇకనైనా విశ్వవిద్యాలయాల్లోకి ఆచార్యులొచ్చేనా ?





దేశాభివృద్ధిలో విద్యయొక్క ప్రాధాన్యత గురించి వేరే చెప్పనక్కరలేదు.అందులో ప్రామాణికత కలిగిన ఉన్నతవిద్య ఎంతో అవసరం.అందుకే దేశవ్యాప్తంగా 1338 విశ్వవిద్యాలయాలుంటే అందులో 56 కేంద్ర విశ్వవిద్యాలయాలు,416కి పైగా వివిధ రాష్ట్రప్రభుత్వ పరిధిలోగల విశ్వవిద్యాలయాలు,130కిపైగా డీమ్డ్ విశ్వవిద్యాలయాలు,430కిపైగా ప్రైవేటు విశ్వవిద్యాలయాలు,ఇంకా పలు జాతీయ,రాష్ట్ర విద్యాసంస్థలు నెలకొనగా అందులో 43 మిలియన్ విద్యార్థులు ఉన్నతవిద్యను అభ్యసిస్తున్నారు.ఒక విశ్వవిద్యాలయం పరిపూర్ణంగా పనిచేయాలంటే దానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి వచ్చేనిధులు మరియు ప్రభుత్వనిధులు సకాలంలో అందాలి.అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది, ప్రయోగ వసతులు పూర్తిస్థాయిలో ఉండాలి.వీటితోపాటు విద్యార్థులకు తమ విద్యనభ్యసించుటలో భాగంగా ఏలాంటి ఆర్థికఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో స్కాలర్షిప్స్ మరియు ఫెలోషిప్ లు అందాలి .అందులోభాగంగానే దేశవ్యాప్తంగానున్న విశ్వవిద్యాలయాలల్లో ఖాళీగానున్న ఆచార్య,సహాచార్య కొలువులభర్తీ ప్రక్రియను మొదలుపెట్టి వీలైనంతత్వరగా పూర్తిచేయాలని యూనివర్సిటీ గ్రాంట్ కమీషన్ కోరి సంవత్సరాలు గడిచిపోతున్న "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్నట్లుగా మారిపోయింది.ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రానికి వచ్చేసరికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం చేపడితే,ఆ తర్వాత 2014లో తెలంగాణ నూతనంగా రాష్ట్రంగా సిద్ధించాక ఏర్పడిన బిఆర్ఎస్ ప్రభుత్వం 2018లో యూనివర్సిటీ కొలువుల రిక్రూట్మెంట్ కు సంబంధించి1061 పోస్టుల భర్తీకి అనుమతినిస్తే,అప్పటి గవర్నర్ దానిని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపితే పెండింగ్ లోకి పడిపోయింది. అప్పటినుండి ఇప్పటివరకు యూనివర్సిటీ కొలువుల నోటిఫికేషన్ ను నోచుకోలేని పరిస్థితి దాపురించింది.కొలువులొస్తాయనే కోటిఆశలతో విద్యార్థులు ఉద్యమంలో పాలల్గొని సాధిస్తే ముమ్మాటికీ వారిఆశలు నిరాశలే అయ్యాయని చెప్పడంలో ఎలాంటి అనుమానం అక్కరలేదు.రాష్ట్రంలో అభివృద్ధికని చెప్పుకునే ఎన్ని కార్యక్రమాలు చేపట్టిన,ఎంత పేరు ప్రఖ్యాతలు గావించిన,నియామకాల విషయంలో మాత్రం నిరుద్యోగులపాలిట శాపంగానే మారిపోయిందని చెప్పవచ్చు. తెలంగాణ రాష్ట్రంలోనున్న 11 యూనివర్సిటీలలో భోదనసిబ్బందికి సంబంధించి 2878 పోస్టులుంటే అందులో కేవలం 753 రెగ్యులర్ సిబ్బంది పనిచేస్తున్నారు.అంటే 2125 పోస్టులు (74శాతం) ఖాళీగా ఉన్నాయి.పరిశోదకవిద్యార్థులకు గైడ్ గా కొనసాగాలన్న,నాణ్యమైన పరిశోదకపత్రాలను సమర్పించాలన్న,కేంద్రంనుండి ప్రాజెక్టులు మరియు నిధులు రావాలన్న ప్రొఫెసర్ల పాత్ర చాలా కీలకంగా ఉంటుంది.కానీ అన్నీ యూనివర్సిటీలలో చాలా డిపార్ట్మెంట్ లలో ఒక్క రెగ్యులర్ ప్రొఫెసర్ లేకపోవడం శోచనీయం.రాష్ట్రంలో అన్నీ యూనివర్సిటీలలో కలిపి 393 ప్రొఫెసర్లకు 212 ఖాళీలు,913 అసోసియేట్ ప్రొఫెసర్లకు 792 ఖాళీలు,1572 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు 1114 ఖాళీలున్నాయంటే పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉన్నదో అర్థమవుతుంది.పదివేలమంది విద్యార్థులున్న ఆర్జీయుకేటిలో 146 సాంక్షన్ పోస్టులుంటే 19మంది మాత్రమే రెగ్యులర్ సిబ్బంది పనిచేయడం విడ్డూరమైతే,అందులో సైతం కొందరు సెలవులలో ఉండటం గమనార్హం.ఇంచుమించు మిగతా యూనివర్సిటీలలో కూడా అదేతంతు కొనసాగుతుండడం చూస్తుంటే గత దశాబ్దన్నర కాలంగా యూనివర్సిటీలలో చదివే విద్యార్థులకు ఎలాంటి విద్యను అందిస్తున్నామో అవగతమవుతుంది.

ప్రత్యేకంగా యూనివర్సిటీలలో ఆచార్య కొలువులకు అర్హతలెలా ఉండాలో గతంలోనే హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆచార్య ఘంటా చక్రపాణి నేతృత్వంలో నియమించిన కమిటీ పరిశోధించి నివేదికను రచించి అందులో అర్హతలకు సంబంధించి డాక్టర్ అఫ్ ఫిలాసఫీ పూర్తిచేయాలి లేదా నెట్,సెట్,జేఆర్ ఎఫ్ క్వాలిఫైడ్ అయ్యివుండి,అకాడమీక్ రికార్డ్,రీసెర్చ్ పెరఫార్మెన్స్,టీచింగ్ స్కిల్స్ మరియు ఇంటర్వ్యూ ఆధారంగా నియమించాలని నివేదికను ప్రభుత్వానికి అందించడం జరిగింది.కానీ కాంట్రాక్ట్ సిబ్బంది తమకు న్యాయం చేయాలనే డిమాండ్ ను తెరమీదకు తేవడంతో నియామకాలు చేపట్టకుండా ఆపివేయడం జరిగింది.''కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు''అన్నట్లు ప్రభుత్వానికి ఒకసాకు లభించినట్లైంది.దాదాపు ఈ అర్హతలు సాదించాలంటే 30 నుండి 40 సంవత్సరాలు వయసు పడుతుంది.ఇలాంటి పోస్టులను గతంలో భర్తీచేసి దశాబ్దన్నరకాలం గడిచిన మరల అంతటి అదృష్టాన్ని నోచుకోలేకపోయిందని చెప్పవచ్చు.అంటే అభ్యర్థులకు వారికి పదవీవిరమణ వయసువచ్చిన ఆశ్చర్యపోనక్కరలేదు.ప్రభుత్వాలు తలుచుకుంటే ఇది పెద్దసమస్య కానేకాదు.కానీ కారణాలు మాత్రం సగటు మనిషికి ఒకింత అనుమానాన్ని కలిగిస్తాయని చెప్పవచ్చు.మొదట ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో కొలువుల భర్తీచేస్తే తెలంగాణ ప్రాంతంవారికీ అన్యాయం జరుగుతుందని భావించి,ప్రతివిద్యార్థి ఉద్యమంలో పాల్గొని,తెలంగాణ ఆవిర్భావంలో విద్యార్థులు,నిరుద్యోగులు కీలకపాత్ర పోషించారని యావత్తు ప్రపంచానికి జగమెరిగిన నగ్నసత్యమే.తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక ముందుగా యూనివర్సిటీలకు శాశ్విత వైస్ ఛాన్సలర్ లేమితో రోస్టర్ సిస్టమ్ ను త్వరగా చేయడానికి కుదరలేదని.తర్వాత కొంతకాలానికి అన్నీ యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్ లను నియమించి,యూనివర్సిటీలు సక్రమంగా నడవడానికి కృషిచేస్తన్నట్లు,రేపోమాపో భర్తీప్రక్రియ పూర్తవుతుందన్నట్లు దినపత్రికల్లో ప్రకటనలు కాస్తా ఎదురుచూసే అర్హులకు భరోసా ఇచ్చినట్లు కనిపించాయి.కానీ సాంకేతికపరమైన కారణాలతో ఖాళీలభర్తీకి నోచుకోలేదు.చూస్తుండగానే రెండు సంవత్సరాల వీసీల పదవీకాలం ముగిసి,కొంతకాలం మరల ఇంచార్జ ఐఏఎస్ ఆఫీసర్ లతో నెట్టుకొచ్చారు.రెగ్యులర్ ఉపకులపతులున్నప్పుడే సాధ్యపడని పనులు,ఇంచార్జ ల పాలనలో పనివత్తిడి కారణంగా సరైనదృష్టి కేంద్రీకరించలేకపోయరన్నారు. చూస్తుండగానే రెండు పర్యాయాలు బిఆర్ఎస్ పార్టీ పాలన కొనసాగించింది.రాష్ట్రంలో కాంగ్రేస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024 అక్టోబర్ లో ఉపకులపతుల నియామకం చేపట్టింది.మరల వారి పదవులు ముగిసేసమయం ఆసన్నమవుతున్న కాలయాపనే జరుగుతుంది.కానీ ఎక్కడ స్పష్టతలేదు. ఇకనైనా ఆచార్యుల కొలువులభర్తీ కొనసాగించి ఉన్నత విద్యనభ్యశిస్తున్నా విద్యార్థులకు న్యాయం చేస్తుందా . . ? లేక ఇలాగే ఏళ్ళతరబడి పార్ట్ టైం,కాంట్రాక్టు,గెస్ట్ ఫాకల్టీలతో పూట గడుపుతుందా ? అనే అనుమానంతో అత్యున్నత చదువులు చదివిన నిరుద్యోగులున్నారనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు.ఇంకొన్నాళ్ళు వేచిచూస్తే ఆ కొలువులపై ఆశలు పెట్టుకున్న నిరుద్యోగ అభ్యర్థులకు ఉద్యోగ విరమణ వయస్సువచ్చి అవకాశాలు చేజారిపోతాయోనన్న భయం లేకపోలేదు. అభివృద్ధి అనేది ఏదో ఒక్కరంగానికే పరిమితమైతే సరిపోదు,అన్నీ రంగాలలో సమభాగాలతో ఉండాలనే ప్రాథమికవిషయాన్నీ గ్రహించి ముందుకెళ్ళినప్పుడే అందరికి మేలు జరుగుతుంది.ప్రామాణికత కల్గిన విద్యగురించి ఎందరో మహానుభావులు ఎన్నో విధాలుగా వివరించారు.అభివృద్ధి అనే విషయంలో విద్యయొక్క పాత్ర చాలా ఉంటుంది.అదికూడా విద్యనభ్యసించిన వారికీ ఉద్యోగవకాశాలు వచ్చినప్పుడే సాధ్యపడుతుంది.స్వాతంత్ర్యానికి పూర్వం ఆంగ్లేయుల పాలనలో భారతదేశంలో ఉచిత మరియు నిర్బంధ ప్రాథమిక విద్యను అమలు చేయాలని (6-10 ఏళ్ల పిల్లలకు) 1910-1911లో ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో మొదటగా గోపాల కృష్ణ గోఖలే వాదించారు.దేశంలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్న సందర్భాలలో సైతం దాదాభాయి నౌరోజీ తమ అనుచరవర్గంతో బ్రిటిష్ ఉన్నతాధికారుల వద్దకు వెళ్ళి,మీరు ఎన్నేళ్లయినా పాలించండి కానీ నాదేశంలో ఉచితనిర్బంద విద్యను అమలుచేయాలని కోరిన ససేమిరా వారు ఒప్పుకోలేదు.1947లో స్వాతంత్ర్యం సముపార్జించిన తర్వాత 2009 లో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో ఉచిత నిర్బంధవిద్యకు చట్టాన్నిచేసి అమలు పరుస్తున్నది.అంటే దాదాపు 62 సంవత్సరాల సమయం పట్టింది.మనప్రభుత్వాలు విద్యకు ఏమేరలో ప్రాధాన్యతనిస్తున్నాయో అర్థమవుతుంది.రాష్ట్రప్రభుత్వం దీనినేమన్న ఆదర్శంగా తీసుకున్నారా? అనే భావన కలుగుతుంది.

ఏదిఏమైనా రాష్ట్రంలోనున్న మేధావివర్గం,పలు సామాజికాభివృద్ధికి పాటుపడే స్వచ్ఛందసంస్థలు,విభిన్న సంఘాలు,ప్రభుత్వ సలహాదారులు,రచయితలు,కవులు,కళాకారులు మరియు ప్రత్యేకంగా వివిధపత్రికల జర్నలిస్టులు ఈసమస్యను క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వాలకు పలుసూచనలను,సమస్య పరిష్కార మార్గాలను చూపాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలు లేక కష్టాలుపడుతూ,కుటుంబాలను పోషించుకోలేని దీనస్థితిలోనున్న నిరుద్యోగుల జీవితాలను అర్థం చేసుకొని,నిరుద్యోగ నిర్మూలనకు పాటుపడుతూ దేశంలోని పలురాష్ట్రాలకు ఆదర్శంగా నిలువాలని ఆశిద్దాం.

డా.పోలం సైదులు,
డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ,
9441930361.



# శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్” జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**- సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్పతి**



**కడ్తాల్, ఫిబ్రవరి 9 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :** గిరిజన ఆరాధ్య దైవం, శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను గిరిజనులు ఘనంగా జరపాలని సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి, గానుగుమర్ల తండా గ్రామ ఉప సర్పంచ్ జర్పుల లక్పతి నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలోని గిరిజన భవనంలో సేవాలాల్ సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేష్ నాయక్ ఆధ్వర్యంలో “శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్” చిత్రపటానికి లక్పతి నాయక్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం లక్పతి నాయక్ మాట్లాడుతూ..ఈనెల 15న నిర్వహించే సేవాలాల్ 287వ జయంతి వేడుకలను. కడ్తాల్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు. గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సంఘం అధ్యక్షులు జైపాల్ నాయక్, సర్పంచులు గోపి నాయక్, దేవసింగ్ నాయక్, అమర్సింగ్ నాయక్, శ్రీను నాయక్, మాజీ సర్పంచ్ హరిచందర్ నాయక్,ఉప సర్పంచ్ గోపాల్ నాయక్,మాజీ ఉప సర్పంచ్ శారద పండు నాయక్,గిరిజన నాయకులు జే.శంకర్ నాయక్, కొటియా నాయక్, భానావత్ శంకర్ నాయక్, భాజా శ్రీను నాయక్,రాజు నాయక్, నాగార్జున్ నాయక్, శ్రీధర్ నాయక్, శ్రీను నాయక్, గణేష్ నాయక్, రమేష్ నాయక్, భిక్కు నాయక్, స్వామిజి శివ నాయక్, టిక్లాల్ నాయక్, లక్ష్మణ్ నాయక్, కిషన్ నాయక్, తేజు నాయక్, వెంకటేష్ నాయక్, నాయకులు, యువకులు, విద్యార్థులు, ఉద్యోగ సంఘాలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండ అభివృద్దే నా ధ్యేయం





-నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ కు పట్టం కట్టాలి
-అభివృద్ధిని కోరుకునే వారంతా చెయ్యి గుర్తుకు ఓటు వేయాలి
-నల్లగొండ అభివృద్ధి కోసం ఎన్ని నిధులైన మంజూరు చేయిస్తా
-పూటకోపాటి మారే వారిని గెలిపిస్తే మనకే నష్టం
-రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
-నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో విస్తృత ప్రచారం

**నల్లగొండ ,ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన ప్రధాన ధ్యేయమని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల 14, 15, 16,17, 3 డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ రోడ్ షో నిర్వహించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో ఇంకా మిగిలి ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డును పూర్తి చేయడంతో పాటు సమస్యలు లేని కాలనీలుగా తీర్చిదిద్దారని డివిజన్లో ప్రతి కాలనీకి 24 గంటలు తాగునీరు వచ్చే విధంగా ఇప్పటికే చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతుందని మరోసారి మంత్రి స్పష్టం చేశారు పూటకో పార్టీ మారే వాళ్లను, ఇతర పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజలకే నష్టం జరుగుతుందని నల్లగొండలో మున్సిపల్ కార్పొరేషన్ గా చేసుకున్నందున కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు వస్తాయన్నారు దీంతో మరిన్ని అభివృద్ధి పనులు చేసుకోవచ్చని పేర్కొన్నారు ఇప్పటికే నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో 2,200 కోట రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే అన్ని డివిజన్లో ఇచ్చిన హామీలన్నిటిని కచ్చితంగా అమలు చేస్తానని స్పష్టం చేశారు నేను పేదోళ్ల మనిషినని, ఇచ్చిన మాట తప్పని పేర్కొన్నారు నల్లగొండ అభివృద్ధి మన చేతుల్లోనే ఉందని, ఇతర పార్టీల అభ్యర్థులను గెలిపించి మోసపోవద్దని కోరారు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే వారు డివిజన్లోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు వీలుంటుంది అన్నారు ఇతర పార్టీకి చెందిన అభ్యర్థులు గెలిస్తే వారితో ఎలాంటి ప్రయోజనం ఉండదని తెలిపారు చర్లపల్లి, ఆర్జాల బావి, పాతపల్లె, శేషమ్మ గూడెం గ్రామాలలో ఎలాంటి సమస్యలు ఉన్న వాటన్నింటినీ పరిష్కరించే బాధ్యత నాదేనని అన్నారు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో ప్రజలంతా చెయ్యి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను రికార్డు స్థాయి మెజార్టీతో గెలిపించాలని కోరారు
ఇక్కడి పార్టీ అభ్యర్థుల గెలుపు రికార్డు స్థాయిలో ఉండాలని, అది ప్రజల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారునల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ప్రశాంతంగా ఉండాలన్నా, అన్ని రంగాలలో అభివృద్ధి కావాలన్నా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు ఈ ప్రచార కార్యక్రమంలో నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బురి శ్రీనివాస్ రెడ్డి, తిప్పర్తి మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్,
14వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి బొజ్జ శంకర్, 15వ డివిజన్ అభ్యర్థి పెరిక నాగరాజు, 16వ డివిజన్ అభ్యర్థి పెరిక స్వాతి వినాయక రాజు (చిట్టి), 17వ డివిజన్ అభ్యర్థి జేరిపోతుల అశ్విని భాస్కర్ గౌడ్, 3వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి గాలి వినోద,
మాజీ కౌన్సిలర్ మందడి శ్రీనివాస్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, పలువురు మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన






**ఎలిగేడు, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం పూర్ణిమ ఫెర్టిలిటీ సంతాన సాఫల్య కేంద్రం, కరీంనగర్ వారి సౌజన్యంతో ఉచిత మెగా సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ కప్పల ప్రవీణ్ ప్రారంభించారు.గ్రామస్తుల నుండి విశేష స్పందన లభించిన ఈ శిబిరంలో 25 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ ప్రవీణ్ మాట్లాడుతూ, “గ్రామంలో ఇలాంటి వైద్య సదుపాయాలు అందించడం గొప్ప విషయం. డాక్టర్ పూర్ణిమ మేడంకు ప్రత్యేక ధన్యవాదాలు” అని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్యురాలు పూర్ణిమ, శిబిరం కోఆర్డినేటర్ రామచందర్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చివరి రోజున ఇంటింటి నమ్మకం...

**14వ వార్డులో శారద బ్రహ్మం ప్రచారానికి ప్రత్యేక గుర్తింపు**




**వనపర్తి టౌన్, ఫిబ్రవరి 09 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** మున్సిపాలిటీ ఎన్నికల ప్రచార చివరి రోజున సోమవారం వనపర్తి పట్టణంలోని 14వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి శారద బ్రహ్మం చేపట్టిన ఇంటింటి ప్రచారం ప్రత్యేకంగా నిలిచింది. పద్ధతి, ప్రణాళిక, వ్యక్తిగత స్పర్శతో సాగిన ఈ ప్రచారం ఓటర్లలో విశ్వాసాన్ని పెంచింది. గతంలో తన భర్త 14వ వార్డుకు అందించిన సేవలను ఓటర్లకు గుర్తు చేస్తూ, ఈసారి అవకాశం ఇస్తే ఎమ్మెల్యే మేఘా రెడ్డి సహకారంతో వార్డును అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తానని ఆమె హామీ ఇచ్చారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలను ప్రాధాన్యంగా పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. వినమ్రత, ఆత్మీయతతో ప్రతి ఇంటిని పలకరిస్తూ అభిప్రాయాలు తెలుసుకోవడం ప్రజలను ఆకట్టుకుంటోందని స్థానికులు పేర్కొన్నారు. మహిళలు, వృద్ధులు, యువత నుంచి లభిస్తున్న సానుకూల స్పందనతో 14వ వార్డులో కాంగ్రెస్ ప్రచారం చివరి రోజున ప్రత్యేక వార్తగా నిలిచిందని పార్టీ వర్గాలు తెలిపాయి.

## 12వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు తెలిపిన ఆర్టీసీ మాజీ ఉద్యోగులు



**కల్వకుర్తి, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మిర్యాల ప్రభావతి, శ్రీనివాస్ రెడ్డికి ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయ్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మద్దతు లభించింది. 12వ వార్డులో ఉన్న ఆర్టీసీ సిబ్బంది గడప గడప తిరిగి ప్రచారం నిర్వహిస్తూ, ప్రభావతి--శ్రీనివాస్ రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్టీసీ జనరల్ సెక్రటరీ బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఖాదిర్, సెక్రటరీ సత్యం, డిపో ప్రెసిడెంట్ ఎండీ నజరుద్దీన్, వైస్ ప్రెసిడెంట్ రాంసింగ్, సెక్రటరీ కేవల్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు, ఇప్ప నందయ్య, యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ప్రభావతి--శ్రీనివాస్ రెడ్డి విజయం సాధిస్తే వార్డు అభివృద్ధి వేగవంతం అవుతుందని, ఆర్టీసీ మాజీ ఉద్యోగులు తమ మద్దతు ప్రకటించారు.

## మూగబోయిన మైకులు ఓటర్లను ప్రసన్నం చేసుకుని పనిలో నాయకులు



**నల్లగొండ, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** నల్లగొండ కార్పొరేషన్, 17 మున్సిపాలిటీల్లో కొద్దిరోజులుగా హోరెత్తిన ఎన్నికల ప్రచారానికి నేటితో తెరపడింది . ప్రధాన పార్టీలన్నీ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఆఖరి ప్రయత్నాల్లో నిమగ్నమయ్యాయి. సాయంత్రం 5 గంటల తర్వాత మైకులు మూగబోయాయి. పోలింగ్ ఈ నెల 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. రూల్స్ ఉల్లంఘిస్తే రెండేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధిస్తామని హెచ్చరించారు

## నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ





**నల్లగొండ ,ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** 2వ సాధారణ ఎన్నికలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన శిక్షణ కౌంటింగ్ ప్రక్రియలో అనుసరించాల్సిన విధివిధానాలు, మార్గదర్శకాలు, జాగ్రత్తలపై స్పష్టమైన అవగాహన , అనుభవజ్ఞులైన మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ అందించారు కార్యక్రమంలో పాల్గొన్న రిటర్నింగ్ అధికారులు, సంబంధిత ఎన్నికల అధికారులు ఎలాంటి లోపాలు లేకుండా, న్యాయసమ్మతంగా కౌంటింగ్ నిర్వహించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని కౌంటింగ్ ప్రక్రియలో పారదర్శకతకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరమని అధికారులు పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో అదనపు ఎన్నికల అధికారి ఎ కమిషనర్,నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉదయం 8 వరకు కోడి కూత వినపడొద్దు!

**ఇంగ్లండ్ ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెల్లవారుజామున 4.30 గంటలకు వస్తున్న కోడి కూత.. పక్కింటి వాళ్లను చాలా ఇబ్బందిపెట్టింది. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేయటంతో సదరు కోడిపుంజును పెంచుకుంటున్న యజమానికి నోటీసులు అందాయి. ఉదయం 8 గంటల వరకు కోడి కూత వినిపించడానికి వీల్లేదు.. అనేది నోటీసు సారాంశం. ఇంగ్లండ్ కౌంటీ ‘నార్‌ఫోక్’లోని గ్రామీణ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది.దీనిపై గ్రామంలోని 600 మందికిపైగా ప్రజలు సదరు కోడిపుంజుకు మద్దతుగా నిలబడేందుకు ముందుకు వచ్చారు. పొద్దునే వినిపించే ఆ కోడి కూతే తమ గ్రామానికి గుర్తింపుగా వారంతా పేర్కొన్నారు. నోటీస్‌పై కోడి పుంజు యజమాని స్పందిస్తూ కౌన్సిల్ నోటీస్ తనకు ఆశ్చర్యం కలిగించిందన్నారు. మెరుగైన రోడ్లు, చెత్త సేకరణపై కౌన్సిల్ దృష్టిపెడితే బాగుంటుందని హితవు పలికారు.

# నేటి నుంచి వైన్స్ షాపులు బంద్

మద్యం ప్రియులకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం



**నల్లగొండ ,ఫిబ్రవరి 9 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాష్ట్రంలో మునిసిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో నేటి నుంచి వైన్ షాపులు బంద్ కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు జరుగుతున్న మునిసిపాలిటీల పరిధిలో ఫిబ్రవరి 9 సాయంత్రం 5 గంటల నుంచి ఫిబ్రవరి 11 సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 48 గంటల పాటు మద్యం విక్రయాలపై నిషేధం అమలులో ఉంటుంది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిషేధ కాలంలో వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లలో మద్యం అమ్మకాలు పూర్తిగా నిలిపివేయనున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అలాగే, ఎన్నికల పోలింగ్ పూర్తయ్యే వరకు మద్యం అక్రమ రవాణా, నిల్వలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించనున్నాయి. మద్యం నిషేధాన్ని ప్రజలు సహకరించాలని, శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా సహకారం అందించాలని అధికారులు కోరారు.

## ఘనంగా శివ సమితి సమక్షంలో అన్నదాన కార్యక్రమం



**అచ్చంపేట, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట కేంద్రంలోని వై జంక్షన్ వద్ద శివ సమితి అధ్యక్షులు సుంకరి నిర్మల బాలరాజు ఆధ్వర్యంలో శివ స్వాములకు అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అచ్చంపేట పట్టణం నుంచి పాదయాత్ర చేస్తూ శ్రీశైలం వెళ్లే శివ స్వాములకు అన్నప్రసాదం అందజేశారు. గత పది సంవత్సరాలుగా ప్రతి శివరాత్రి సందర్భంగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని సుంకరి నిర్మల బాలరాజు దంపతులు నిరంతరంగా నిర్వహిస్తూ భక్తులకు సేవ చేస్తున్నారు.ఈ సందర్భంగా భక్తులు, గ్రామస్థులు, కుటుంబ సభ్యులు దంపతులకు శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆశీస్సులు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు గోపాల్ రెడ్డి, కౌన్సిలర్ అప్ప శివ, జెడ్పిటిసి రాంబాబు, అంతటి మల్లేష్, గొర్ల నరసింహా, సుంకరి లింగమయ్య, రాజు, మహేష్, విష్ణు యాదవ్, కృష్ణ యాదవ్, నిరంజన్, శీను, చరణ్ తదితరులు పాల్గొన్నారు. శివ స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆర్ఎస్ఎంఎ సమక్షంలో పదవ తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు



**అచ్చంపేట, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. స్థానిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాసనసభ్యుడు డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.విద్యార్థుల విద్యా జీవితంలో పదవ తరగతి అత్యంత కీలకమైన సంవత్సరం అని ఆయన పేర్కొన్నారు. ఇది కేవలం పరీక్షల సంవత్సరం మాత్రమే కాకుండా భవిష్యత్ దిశను నిర్ణయించే పునాది అని అన్నారు. భయపడాల్సిన అవసరం లేదని, సరైన ప్రణాళికతో చదివితే పదవ తరగతి సులభంగా పూర్తి చేయవచ్చని ధైర్యం చెప్పారు.పరీక్షలు మీ ప్రతిభను పరీక్షించడానికి మాత్రమే --- మీ విలువను కాదు. అందుకే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి అని విద్యార్థులకు ప్రోత్సాహం ఇచ్చారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని, క్రమబద్ధమైన చదువు, సమయపాలన, పునశ్చరణ అలవాటు విద్యార్థుల విజయానికి దోహదం చేస్తాయని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల మేనేజ్మెంట్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ కరాటే పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన సాయి సిద్ధార్థ్.



**హైదరాబాద్, ఫిబ్రవరి 9. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** హైదరాబాద్‌కు చెందిన యువ కరాటే క్రీడాకారుడు వి. సాయి సిద్ధార్థ్ అంతర్జాతీయ స్థాయిలో తన ప్రతిభను చాటాడు. సరోజ్‌నగర్‌లోని ఎల్.బీ.నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 8న నిర్వహించిన 5వ అంతర్జాతీయ ఓపెన్ టు ఆల్ స్టైల్స్ కరాటే, కుంగ్ ఫూ మరియు తైక్వాండో చాంపియన్‌షిప్ – – 2026లో ఆయన రెండో స్థానం (సిల్వర్ మెడల్) సాధించాడు. ఈ అంతర్జాతీయ పోటీల్లో వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. తీవ్ర పోటీ మధ్య వి. సాయి సిద్ధార్థ్ ధైర్యం, క్రమశిక్షణ మరియు సాంకేతిక నైపుణ్యంతో అద్భుత ప్రదర్శన ఇచ్చి ఈ విజయాన్ని అందుకున్నాడు.

వి. సాయి సిద్ధార్థ్ ఏపెక్స్ షోటోకాన్ కరాటే అకాడమీ, హైదరాబాద్‌కు చెందిన క్రీడాకారుడు. అకాడమీ వ్యవస్థాపకులు మరియు డైరెక్టర్ కే. నవీన్ నాయక్ గారి శిక్షణ, మార్గదర్శకత్వమే ఈ విజయానికి ప్రధాన కారణమని క్రీడా వర్గాలు పేర్కొన్నాయి.ఈ సందర్భంగా అకాడమీ నిర్వాహకులు, శిక్షకులు, తల్లిదండ్రులు సాయి సిద్ధార్థ్‌ను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# కల్వకుర్తి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ రోడ్ షో









**కల్వకుర్తి, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించబడింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఆటపాటలతో పెద్ద ఎత్తున పాల్గొని రోడ్ షోను విజయవంతం చేశారు.స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, “రాష్ట్ర ముఖ్యమంత్రి బడుగు బలహీన వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. కల్వకుర్తిలో 100 పడకల ఆసుపత్రి, డ్రైనేజీ వ్యవస్థ, పేద విద్యార్థుల కోసం ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలపాటు ప్రజాపాలనను గాలికి వదిలేసి, ఖజానాకు గండి కొట్టింది. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అభ్యర్థులను అఖండ విజయంతో గెలిపించాలి” అని పిలుపునిచ్చారు.మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి బృంగి రత్నమాల, ఆనంద్ కుమార్ అఖండ మెజారిటీతో గెలుస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కల్వకుర్తి చైర్మన్ పీఠం కాంగ్రెస్ పార్టీదేనని ప్రజలకు వివరించారు.ఈ రోడ్ షోలో 22 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు పాల్గొన్నారు. రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యుడు ఠాగూర్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయకుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, జిల్లెల్ల రాములు, వెల్దండ మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కదం తొక్కిన బీఆర్ఎస్ శ్రేణులు

## విజయవంతమైన కార్నర్ మీటింగ్









**వనపర్తి ఫిబ్రవరి 09(నీలగిరి ఎక్స ప్రెస్):** మున్సిపల్ ఎన్నికల ప్రచార చివరి రోజు సందర్భంగా వనపర్తి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్ విజయవంతమైంది. వేలాదిమంది కార్యకర్తలు, పార్టీ శ్రేణులతో సమావేశం ఉత్సాహంగా సాగింది. ఈ సమావేశంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్ పాల్గొని ప్రసంగించారు. నిరంజన్ రెడ్డి ప్రసంగం కార్యకర్తల్లో జోష్ పెంచింది. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాధన, అభివృద్ధి కెసిఆర్ నాయకత్వంలో సాధ్యమైందన్నారు. తెలంగాణ రాకముందు 14 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు ఉండగా, కెసిఆర్ పాలనలో కోటి 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందిందన్నారు. విద్యుత్ కోతలను నివారించి మిగులు విద్యుత్ సాధించామని, పరిశ్రమలు, ఐటీ అభివృద్ధితో లక్షలాది ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. ఆసరా పింఛన్లు, రైతుబంధు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రోడ్ల విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని, రైతులు యూరియా కోసం లైన్లలో నిలబడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ మోసం జరుగుతుందని హెచ్చరించారు.మున్సిపల్ ఎన్నికల విజయంతో కెసిఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల విస్తరణ, విద్యా రంగ అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందన్నారు. స్వామి గౌడ్ మాట్లాడుతూ నిరంజన్ రెడ్డి ముందు, తర్వాత వనపర్తి అభివృద్ధిని ప్రజలు గమనించాలని అన్నారు. చెరువుల పునరుద్ధరణ, విద్యా సంస్థలు, జిల్లా ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలకే పరిమితమైందని విమర్శించారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో 31 మంది బీఆర్ఎస్ అభ్యర్థులు, ఇద్దరు సీపీఐ(ఎం) అభ్యర్థులు, పార్టీ నాయకులు గట్టు యాదవ్, బి.లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, గంధం బాలపీరు, వేణుగోపాల్, గులాం ఖాదర్ ఖాన్, బొబ్బిలి ప్రేమ్ కుమార్, సయ్యద్ జమీల్, సూర్యవంశం గిరి, జోహెబ్ హుస్సేన్, చిట్యాల రాము, మాజీ ప్రజాప్రతినిధులు కృష్ణా నాయక్, జగదీశ్వర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, అమ్మపల్లి శ్రీనివాస్ రెడ్డి, భీమన్న, మధుసూదన్ రెడ్డి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ గోడపత్రిక ఆవిష్కరణ



రంగారెడ్డి, ఫిబ్రవరి 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఈ నెల 12న హైదరాబాద్‌లో జరగనున్న లి"తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ"లికు సంబంధించిన గోడపత్రికను సోమవారం మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు దూసకంటి రవి, మునవాత్ ఠాకూర్, ఊరెడి ప్రకాశ్ ముదిరాజ్, కే. గొవర్ధన్ చారి, సలెకుల శ్రీశైలం యాదవ్, మాద్గుల సాయిరాం, తడకల పరమేశ్, ఉండల్ల బాబురావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ, "తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను పణంగా పెట్టి అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని సగర్వంగా చాటిచెప్పేందుకు ఈ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం. ఉద్యమకారుడే తెలంగాణకు అసలైన అస్థిత్వం. మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ వెనుక వేలాది మంది ఉద్యమకారుల త్యాగాలు, అమరవీరుల బలిదానాలు ఉన్నాయి" అని పేర్కొన్నారు. అలాగే ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు, ఇతర రాష్ట్రాల్లో లభిస్తున్న రాయితీలను తెలంగాణలోనూ సాధించేందుకు ఐక్యత అవసరమని, ఈ సభ ద్వారా ఉద్యమకారుల అజేయ శక్తిని చాటిచెప్పే ప్రయత్నం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఈ సభ నిర్వహణ జరుగుతుందని, ఉద్యమకారుల ప్రస్తుత పరిస్థితులు, వారి ఆవేదనపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని పాండురంగారెడ్డి వివరించారు. ఈ సభకు తెలంగాణ నలుమూలల నుంచి ఉద్యమకారులు, జాగృతి శ్రేణులు, మేధావులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. "ఇది కేవలం ఒక సభ మాత్రమే కాదు, తెలంగాణ ఉద్యమ చరిత్రలో మరో కీలక ఘట్టం" అని పాండురంగారెడ్డి స్పష్టం చేశారు.

# అట్టుడుకుతున్న మణిపూర్...

రెండు వర్గాల మధ్య ఘర్షణ
పదుల ఇండ్లకు నిప్పు
పక్క జిల్లాకు ప్రజల పరారీ
బీజేపీ సర్కార్ ఏర్పడిన కొద్ది రోజులకే హింస



**న్యూఢిల్లీ – ఫిబ్రవరి 9(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే అక్కడ మళ్లీ హింస చెలరేగింది. ఉఖ్రుల్ జిల్లాలో సోమవారం టాంగ్‌ఖుల్ నాగా, కుకీ వర్గాలు పరస్పరం దాడులకు తెగబడ్డాయి. సాయుధులైన దుండగులు లిటాన్ గ్రామంలో 20కిపైగా ఇండ్లకు నిప్పు పెట్టారని అధికారులు తెలిపారు. దీంతో పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు భద్రతా బలగాలు గాల్లోకి కాల్పులు జరిపినట్టు పేర్కొన్నారు. లిటాన్, టాంగ్‌ఖుల్ గ్రామానికి చెందిన ప్రజలు ప్రాణాలు కాపాడుకునేందుకు ఇండ్లను వదిలి, పక్క జిల్లా కాంగ్‌పోక్పీకి పారిపోయారని తెలిసింది. లిటాన్ గ్రామంలో శనివారం రాత్రి నాగా వర్గానికి చెందిన ఓ వ్యక్తిపై సామూహిక దాడి ఘటన.. తాజా హింసకు దారితీసిందని అధికారులు చెబుతున్నారు.

# గూండారాజ్యాన్ని మేం ఆమోదించం: సీజేఐ



**న్యూఢిల్లీ – ఫిబ్రవరి 9(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** గూండారాజ్యం ఆమోదయోగ్యం కాదు అని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఢిల్లీలోని తీస్ హజారీ కోర్టులో ఓ న్యాయవాదిపై జరిగిన దాడి కేసులో సుప్రీం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఆ న్యాయవాది దాఖలు చేసిన అత్యవసర పిటీషన్ పై సుప్రీంకోర్టు స్పందిస్తూ.. ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను ఆశ్రయించాలని కోరింది. ఫిబ్రవరి 7వ తేదీన తీస్ హజారీ కోర్టులో నిందితుడి తరపున వాదిస్తున్న లాయర్‌పై మరో వర్గానికి చెందిన లాయర్, అతని మనుషులు కోర్టులోనే దాడి చేశారు. జడ్జీ ముందునేగా ఆ అటాక్ జరిగింది. కోర్టులో అందరు ఉన్నప్పుడే ఈ ఘటన జరిగినట్లు ఆ న్యాయవాది తన పిటీషన్‌లో పేర్కొన్నారు. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, ఎన్వీ అంజారియాతో కూడిన ధర్మాసనం ఈ పిటీషన్‌పై స్పందిస్తూ.. జనవరి 7వ తేదీన జరిగిన ఘటన గురించి ఢిల్లీ హైకోర్టు సీజేకు ఇన్ఫార్మ్ చేశారా అని సుప్రీం ప్రశ్నించింది. ఢిల్లీ హైకోర్టు సీజేకు లేఖ రాసి, ఆ లేఖను తనకు కూడా పంపమని సుప్రీం సీజే అన్నారు. తొలుత హైకోర్టు చీఫ్ జస్టిస్ దీనిపై స్పందించాలన్నారు. అయితే పరిపాలనా విభాగం చర్యలు తీసుకుంటుదని సుప్రీం ధర్మాసనం వెల్లడించింది. ఇలాంటి గుండారాజ్యం తమకు ఆమోదయోగ్యం కాదు అని, అంటే ఇక్కడ చట్టం విఫలమైనట్లే అని పేర్కొన్నది. తమ పరిధిలో ఉన్న హైకోర్టుకు వెళ్లాలని కోర్టు చెప్పింది.

# రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకే ప్రజాదరణ- జూపల్లి





**వనపర్తి, ఫిబ్రవరి 9 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు రోజురోజుకు పెరుగుతోందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా సోమవారం వనపర్తి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 33 వార్డుల నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. పాలిటెక్నిక్ కళాశాల ముందు జరిగిన కార్నర్ మీటింగ్‌లో వేలాది మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎన్నికల పరిశీలకులు మాజీ మంత్రి సాంబని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, డీసీసీ అధ్యక్షులు శివసేనరెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, సన్నవడ్ల బోనస్, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలు ప్రజలకు మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి కొనసాగాలంటే హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బిజెపి, టీఆర్ఎస్ లు రాష్టానికి చేసిందేమీ లేదు

. కాంగ్రెస్ కు పట్టం కట్టండి.. అభివృద్ధి చేసి చూపిస్తాం
. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి





**ఆమనగల్లు, ఫిబ్రవరి 9(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** గత పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో, బిజెపి పాలనలో తెలంగాణకు ఏం చేశారు చెప్పాలని కల్వకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ 15 వార్డుల అభ్యర్థులతో గాంధీ చౌక్ వద్ద రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్ఎస్, బిజెపిలకు చావు దెబ్బ తప్ప దన్నారు. ప్రజా విశ్వాసం కోల్పోయిన ఆయా పార్టీలు ఉనికి కోసం సాగిస్తున్న ఎత్తుగడలను తిప్పి కొట్టాలన్నారు. ఆమనగల్లు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ కు ఓటెయ్యాలన్నారు. కాంగ్రెస్ కు ఓటేస్తే. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు తీసుకొస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. 15వార్డుల కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఆయనకు కోరారు. కాంగ్రెస్ చేపడుతున్న పథకాలు ప్రతి పేదవారికి అందుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఎలాంటి పథకాలు ప్రతి కార్యకర్తకు లబ్ధిపొందు తున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బట్టు కిషన్ రెడ్డి, సూదుని రాంరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, పీసీసీ కోర్డినేటర్ విజయ రెడ్డి, 15 వార్డుల అభ్యర్థులు, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన విహార యాత్రతో విద్యార్థులకు చదువుపై ఆసక్తి



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 9(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఇబ్రహీంపట్నం మండలంలోని టీఎన్ఆర్ జడ్పీహెచ్ఎస్ దండుమైలారం పాఠశాల విద్యార్థులు విజ్ఞాన విహార యాత్రలో భాగంగా నాగార్జునసాగర్‌ను సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం, పదవ తరగతి విద్యార్థులు ఆదివారం ఈ యాత్రలో పాల్గొన్నారు. విద్యార్థులు నాగార్జునసాగర్ డ్యాం, పవర్ హౌస్, బుద్ధవనం, అలాగే లాంచిలో నాగార్జునకొండను సందర్శించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ, విద్యా విహార యాత్రలు విద్యార్థులకు వినోదంతో పాటు ప్రత్యక్ష అనుభవాలను కలిగిస్తాయని, చదువుపై ఉత్సాహాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిఎంఓ వెంకటేష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శ్రీదేవి, రామకృష్ణ, వెంకటరమణ, లింగమయ్య, రామేశ్వరీ, పూజారి రమేశ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇదేనా మీ వృత్తి నైపుణ్యం..

## డిజిటల్ మోసాలపై బ్యాంకులకు సుప్రీం చీవాట్లు



**న్యూఢిల్లీ : ఫిబ్రవరి 9(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** డిజిటల్ అరెస్టు మోసం కేసులను పరిష్కరించడంలో బ్యాంకుల వృత్తి నైపుణ్యంపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర ఆగ్రహం ప్రకటించింది. కష్టమర్లు తమ జీవితకాల పొదుపు మొత్తాలను కోల్పోతున్నప్పటికీ అనుమానాస్పద లావాదేవీలను వెంటనే ఎందుకు అడ్డుకోవడం లేదని బ్యాంకులను సుప్రీంకోర్టు నిలదీసింది. అటువంటి మోసాలను ఎదుర్కొనడానికి తీసుకుంటున్న చర్యలపై కేంద్ర హోం శాఖ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ(మీటీ) దాఖలు చేసిన స్థాయీ నివేదికలను కేంద్రం సమర్పించిన సందర్భంగా ఈ అంశాన్ని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం చేపట్టింది. కేసులకు సంబంధించిన డాటాను క్రోడీకరించి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్(ఎస్ఓపీ)ని సిద్ధం చేస్తున్నామని అటార్నీ జనరల్ కోర్టుకు తెలిపారు. కష్టమర్లను రక్షించాల్సిన బాధ్యత బ్యాంకులకు ఉందని ధర్మాసనం పేర్కొంది. ఈ ఏడాది జనవరి 2న రూపొందించిన ఎస్ఓపీని అధికారికంగా స్వీకరించి అమలు చేయాలని, చోరీ అయిన నిధులను పునరుద్ధరించడానికి ఇంటర్-ఏజెన్సీ సహకారాన్ని బలోపేతం చేయడానికి ప్రొసీజర్లను నిర్ధారించాలని హోం శాఖని ఆదేశించింది.